ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 32.0 కనిష్ఠం : 22.0
ANDHRAJYOTHY 5
నారాయణపేట
జిల్లా వార్తలు
గురువారం 14 నవంబరు 2024



రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

● జడ్చర్ల, గొల్లపల్లి మధ్య ఘటన

జడ్చర్ల, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : రైలు ఢీ కొని గుర్తుతెలియని వ్యక్తి(40) మృతి చెందిన సంఘటన జడ్చర్ల, గొల్లపల్లి మధ్య మధ్య బుధవారం చోటుచేసుకుంది. రైల్వే ఎస్‌ఐ అక్బర్ తెలిపిన వివరాల ప్రకారం.. జడ్చర్ల, గొల్లపల్లి మధ్య రైల్వే పట్టాలపై గుర్తుతెలియని రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని జిల్లా జనరల్ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.



ధాన్యం తరలించాలి

నారాయణపేట కలెక్టర్

మద్దూర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లులకు, గోదాంలకు తరలించాలని నారాయణపేట కలెక్టర్ సిక్తా పట్నాయక్ చెప్పారు. బుధవారం ఆమె మండలంలోని పల్లెగడ్డ, దోరేపల్లి తండాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం పరిశీలించారు. రైతులతో మాట్లాడుతూ దిగుబడి గురించి తెసులుకున్నారు. ధాన్యం తేమ పరిశీలించారు. కేంద్రాలకు అవసరమైన యంత్రాలను ఎందుకు సమకూర్చలేదని జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారిణి బామణిని ఫోన్లో ప్రశ్నించారు. వాటిని ఏర్పాటు చేయాలని చెప్పారు. 18 కేంద్రాలు మంజూరుకాగా, 15 ప్రారంభించామని అధికారులు చెప్పారు.



సదర్ సంబురం

ఆకట్టుకున్న విన్యాసాలు

బాలానగర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): బాలానగర్ మండలంలోని గౌతాపూర్ గ్రామంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన సదర్ ఉత్సవాలు ఆకట్టుకున్నాయి. దున్నపోతుతో చేయించిన విన్యాసాలు ఔరా అనిపించాయి. ఈ విన్యాసాలను చూసేందుకు ప్రజలు అధిక సంఖ్యలో తరలొచ్చారు. కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు శ్రీశైలం యాదవ్, శ్రీనివాస్ యాదవ్, గౌతాపూర్ కైలాట్ యాదవ్, అక్షయ్ యాదవ్, ప్రసాద్ యాదవ్, బన్ని యాదవ్, దిలీప్ యాదవ్, ధర్మరాజు యాదవ్, మల్లేష్ యాదవ్, శ్రీశైలం పాల్గొన్నారు.



ఉద్యమకారులపై నేటికీ కేసులు

పూర్తిగా అమలు కాని జీవో

తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో పాల్గొన్న వారిపై పెట్టిన కేసులు నేటికీ ఉన్నాయి. జేఏసీగా ఏర్పడి చేపట్టిన ఈ పోరాటం 2001 నుంచి 2014 వరకు ఉవ్వెత్తున ఎగసింది. ప్రజలు స్వచ్ఛందంగా రోడ్లపైకొచ్చి మేముసైతం అంటూ ఉద్యమానికి ఉప్పందించారు. వివిధ రూపాల్లో చేపట్టిన పోరాటం ఫలించి 2014 జూన్ రెండున రాష్ట్రం ఏర్పడింది. ఈ నేపథ్యంలో ఉద్యమ నాయకులపై పెట్టిన కేసులను ఎత్తేయాలని అప్పట్లో అధికారంలోకొచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం జీవో జారీ చేసింది. పోలీసు శాఖ స్పష్టమైన వివరాలు ఇవ్వకపోవడంతో పలువురిపై నేటికీ కేసులు ఉన్నాయి. 6

నోటీసుల కలకలం

- ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ ఎమ్మెల్యేల విచారణకు రంగం సిద్ధం
- ఉమ్మడి పాలమూరు జిల్లాలో నలుగురికి నోటీసులు ఇచ్చే అవకాశం
- కేసు మొదట్లోనే ఫిర్యాదులు చేసిన పాలమూరు ప్రస్తుత ఎమ్మెల్యేలు
- ఇప్పటికే నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యకు నోటీసులు
- గతంలోనే ఫోన్ ట్యాపింగ్ కేసులో పాలమూరు లింకులపై కథనాలు



గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రతిపక్షాలు, ప్రజాసంఘాలు ప్రభుత్వాన్ని నిలదీసే వారిని నియంత్రించేందుకు ఉపయోగించారంటున్న ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం మరోసారి కలకలం రేపుతోంది. ఇప్పటిదాకా ఉన్నత స్థాయి అధికారులనే విచారించగా ఇప్పుడు ప్రజాప్రతినిధుల వంతు వచ్చింది. అందులోనూ మొదటి విడతలోనే నలుగురు పాలమూరు మాజీ ఎమ్మెల్యేలు ఉన్నారని తెలుస్తోంది. ఈ వ్యవహారంలో గతంలో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి తదితరులు కూడా ఫిర్యాదులు చేశారు. నిందితులెవరో తేలితే జిల్లాలో మారో సారి రాజకీయ దుమారం రేగే పరిస్థితి ఉంది.

మహబూబ్‌నగర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : ఫోన్ ట్యాపింగ్ కేసు ఉచ్చు ఉమ్మడి పాలమూరు జిల్లాలోని మాజీ ఎమ్మెల్యేలకు బిగియనుందా, గతంలో వచ్చిన ఆరోపణలు, చేసిన ఫిర్యాదుల నేపథ్యంలో నోటీసులు సిద్ధమవుతున్నాయా, ఇన్నాళ్లు మాజీ ప్రజాప్రతినిధుల పాత్రపై దర్యాప్తు కొనసాగించిన అధికారులు

(మిగతా 6లో..)

అధికారుల పాత్రపైనా?



ప్రస్తుతం మాజీలకు నోటీసులు ఇస్తున్న అధికారులు అప్పట్లో ఫోన్ ట్యాపింగ్‌కు సహకరించిన అధికారులు, ఆ ప్రత్యేక బెదిరింపు బృందాల్లో ఉన్న సభ్యులపైన మలి విడతలో ఫోకస్ పెట్టే అవకాశం ఉంది. ఈ ట్యాపింగ్‌కు సంబంధించి అప్పటి ప్రతిపక్ష కాంగ్రెస్, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీతో సహా అనేక ప్రజాసంఘాలు, జర్నలిస్టులు కూడా బాధితులుగా ఉన్నారు. ఈ ట్యాపింగ్‌ను అనుకూలంగా వాడుకొని మహబూబ్‌నగర్ జిల్లాలో ఒక సీఐ అనేక దందాలు చేసినట్లు తెలిసింది. ఎన్నికల సమయంలో ఆయనను మార్చారు. ఎక్కువగా అడ్డగోలుగా సహకరించిన పోలీసు అధికారులు ఇందులో ఇరుక్కోనున్నారు. ఇప్పుడు ఫోన్ ట్యాపింగ్ కేసులో అరెస్టులో ఉన్న పోలీసు ఉన్నతాధికారుల కాల్‌డేటా ఆధారంగా నోటీసులు సిద్ధం చేస్తుండగా తర్వాత దశలో మాజీల ఫోన్ కాల్‌డేటా ఆధారంగా వారికి ఎక్కువగా సహకరించిన అధికారులకు నోటీసులు అందనున్నట్లు సమాచారం.

నాణ్యమైన విద్య అందించేందుకు కృషి

- మారిన కరికులం మేరకు పుస్తకాల కోసం ప్రతిపాదనలు
- 'ఆంధ్రజ్యోతి'తో పీయూ ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రకిరణ్

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ



పాలమూరు యూనివర్సిటీ, నవంబరు 13(ఆంధ్రజ్యోతి) : 'విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు కృషి చేస్తున్నాం. వర్సిటీలో కొత్త కోర్సులకు తరగతులు లేక ఇబ్బందులు ఉన్నాయి. విశ్వ విద్యాలయంలో ర్యాగింగ్ లేనే లేదు' అని అంటున్నారు పాలమూరు యూనివర్సిటీ ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రకిరణ్ బుధవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. ఆ వివరాలు..

వర్సిటీలో గదుల కొరతను ఎలా అధిగమిస్తున్నారు?

యూనివర్సిటీ పీజీ సెంటర్‌లో ప్రధానంగా కొత్త కోర్సులకు తరగతి గదుల కొరత ఉన్నది. దాంతో ఎంఏ తెలుగు స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో, ఎంసీఏ తరగతులు ఇంటిగ్రేటెడ్ విభాగంలో, ఎన్విరాన్‌మెంట్ సైన్స్ తరగతులు బోటని విభాగంలో షిఫ్టింగ్ పద్ధతిలో నిర్వహిస్తున్నాం.

హాస్టల్స్‌లో ఒక్కో గదిలో 10 మంది విద్యార్థులు ఉంటున్నామని అంటున్నారు?

హాస్టల్స్‌లో మౌలిక వసతులు ఉన్నాయి. ఇటీవల బాలికల హాస్టల్స్‌ను ప్రారంభించాము. అబ్బాయిలకు మరో హాస్టల్ నిర్మించాల్సి ఉంది.

కరికులంలో ఎలాంటి మార్పులు వచ్చాయి?

గత కరికులంలో సెమిస్టర్ విధానంలో ఎక్స్‌టర్నల్స్ ఇంటర్నల్స్‌లో 80:20 ప్రకారం క్రెడిట్స్ ఉండేవి. ప్రస్తుతం ఉన్నత విద్యామండలి తెచ్చిన మార్పుల వల్ల 60:40 ప్రకారం క్రెడిట్స్ ఇస్తున్నాం. ప్రైవేటు కళాశాలల్లో ఇంటర్నల్స్ 40కి 40 మార్కులు వేస్తారని, ఫీజు రీయింబర్స్‌మెంట్ వస్తుందని, కళాశాలకు వెళ్లకున్నా అడగరని అక్కడికి వెళ్తున్నారు. దాంతో యూనివర్సిటీ విద్యార్థులు రెగ్యులర్‌గా వచ్చినా.. కష్టపడి చదివినా గోల్డ్ మెడల్ సాధించడంలో వెనుకబడుతున్నారు. పాత పద్ధతి బాగుండేది.

ర్యాగింగ్, డ్రగ్స్ రూపుమాపేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

వర్సిటీలో అసాంఘిక కార్యక్రమాలకు తావులేదు. విద్యార్థులు డ్రగ్స్ లాంటివి తీసుకోరు. ర్యాగింగ్ కూడా ఏమీలేదు. ర్యాగింగ్ నివారణకు ప్రత్యేక కమిటీ ఉంది. ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటాం.

మారిన కరికులం ప్రకారం కొత్త పుస్తకాలు అందుబాటులో ఉన్నాయా?

ప్రస్తుతం పీజీ కోర్సుల సిలబస్ ప్రకారం లైబ్రరీలో అన్ని పుస్తకాలు ఉన్నాయి. మరిన్ని పుస్తకాలు త్వరలోనే విద్యార్థులకు అందుబాటులోకి వస్తాయి.

గద్వాల చిన్నారుల కళా నైపుణ్యం

బాలభవన్ వేదికగా నాట్యంలో శిక్షణ.. రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణింపు
ఢిల్లీ నేషనల్ చైల్డ్ అసెంబ్లీలో ప్రదర్శన
నేడు బాలల దినోత్సవం 7

భార్యను కొట్టి చంపిన భర్త

తలపై కర్రతో బాదడంతో మృతి
తాగుడుకు అలవాటు పడిన భర్త వేధింపులు భరించలేక నిలదీసినందుకే..
నవాబ్‌పేట మండల కేంద్రంలో ఘటన 7

ఎస్‌ఐ బ్రదర్స్

మేనమామ స్ఫూర్తితో ఇద్దరికీ పోలీస్ జాబ్స్ 7
తొలి ప్రయత్నంలో అన్న మలిసారి తమ్ముడు ఎంపిక

కలిసొచ్చిన మహాలక్ష్మి

- ఆర్టీసీకి రెట్టింపు ఆదాయం
- పథకం ప్రారంభానికి ముందు నారాయణపేట డిపోకు రోజుకు రూ.10 లక్షలు
- ప్రస్తుతం రూ.20 లక్షలు



నారాయణపేట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీకి మహాలక్ష్మి పథకంతో రెట్టింపు ఆదాయం వచ్చింది. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీల హామీల్లో భాగంగా మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించారు. గత డిసెంబరు 9న ఈ పథకాన్ని ప్రారంభించారు. నాటి నుంచి బస్సుల్లో మహిళా ప్రయాణికుల సంఖ్య పెరిగింది. నారాయణపేట డిపో నష్టాల నుంచి లాభాల బాటలో నడుస్తోంది. జిల్లాలో నారాయణపేట, కోస్గి రెండు డిపోలు ఉన్నాయి. నారాయణపేట డిపోలో 99 బస్సులకు గాను 53 ప్రభుత్వ, 46 ప్రైవేటు బస్సులు ఉన్నాయి. రోజుకు 35,882 కిలో మీటర్లు తిరుగుతుండగా, 360 మంది సిబ్బంది పని చేస్తున్నారు. కోస్గి డిపోలో 14 బస్సులు ఉన్నాయి. రోజుకు 5,800 కిలో మీటర్లు తిరుగుతున్నాయి. ఇక్కడ 60 మంది సిబ్బంది పని చేస్తున్నారు. రెండు డిపోల్లో నిత్యం 50 వేల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. రోజు 7,500 నుంచి 8,000 లీటర్ల డీజిల్ వినియోగం అవుతుండగా, నారాయణపేట డిపోకు రూ.20 లక్షలు, కోస్గి డిపోకు రూ. రెండు లక్షల వరకు ఆదాయం వస్తోంది. మహాలక్ష్మి పథకం ఆరంభం కంటే ముందు నారాయణపేట డిపోకు రోజుకు రూ.పది లక్షలు, కోస్గి డిపోకు రూ.లక్ష ఆదాయం వచ్చేది. పథకం ప్రారంభించాక ఆదాయం రెట్టింపైంది.

నారాయణపేట డిపో పరిధిలో ప్రయాణించిన మహిళల సంఖ్య, వచ్చిన ఆదాయం వివరాలు (రూపాయల్లో)

నెల	ప్రయాణికులు	ఆదాయం
జనవరి	663732	3,22,78,569
ఫిబ్రవరి	677731	3,22,67,590
మార్చి	734071	34906273
ఏప్రిల్	707297	3,61,28,853
మే	690480	3,76,77,896
జూన్	681135	3,48,37,410
జూలై	724836	3,45,62,360
ఆగస్టు	799672	37932655
సెప్టెంబరు	719297	33180862
అక్టోబరు	722303	3,73,93,330
మొత్తం	7120554	351165798

సమష్టి కృషితో సక్సెస్

మహాలక్ష్మి పథకం ప్రారంభం, ఆర్టీసీ కార్మికులు, అధికారులు, సిబ్బంది సమష్టి కృషితో ఆర్టీసీకి ఆదాయం పెరిగింది. నవంబరు నుంచి వివాహ శుభకార్యాలకు కిలో మీటరుకు రూ.ఆరు నుంచి రూ.ఏడు వరకు రాయితీతో బస్సు సౌకర్యం కల్పిస్తున్నాం. శబరి బస్సుకు గతంలో కంటే ఈసారి రూ.20 వేలు తగ్గుతుంది. ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి.

- లావణ్య, ఆర్టీసీ డిపో మేనేజర్ నారాయణపేట, కోస్గి

పెరుగుతున్న షుగర్ వ్యాధిగ్రస్తులు

- మహబూబ్‌నగర్ జిల్లాలో 46,648 మంది బాధితులు
- పట్టణ ప్రాంతాల్లోనే అధికంగా నమోదు
- నేడు ప్రపంచ డయాబెటిక్ దినోత్సవం



ఎన్‌సీడీ క్లినిక్‌లో షుగర్ పరీక్ష చేస్తున్న వైద్యసిబ్బంది

మహబూబ్‌నగర్ (వైద్యవిభాగం), నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): జీవన శైలిలో మార్పులు, ఆహారపు అలవాట్లు, వంశపారంపర్యంగా వస్తున్న షుగర్ వ్యాధి మహబూబ్‌నగర్ జిల్లాలో విస్తృతంగా పెరుగుతోంది. గత ఏడాదితో పోలిస్తే ఆ సంఖ్య మరింత పెరగడం ఆందోళన కలిగిస్తోంది. ఎన్‌సీడీ సర్వే ద్వారా జిల్లాలో 30 ఏళ్లకు పైబడిన వివరాలు చూస్తే 46,648 మంది షుగర్ వ్యాధిగ్రస్తులు ఉన్నారు. వారిలో అధికారికంగా మందులు వాడుతున్న వారు 16,525 మంది ఉన్నా రు. మిగతా వారు ప్రైవేటులో మందులు వాడుతున్నారు. బాధితులు పట్టణ ప్రాంతాల్లోనే ఎక్కువగా ఉన్నారు. ఈ లెక్కల ప్రకారం జిల్లాలోని 25 పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీ, సీహెచ్‌సీలలో అత్యధికంగా మహబూబ్‌నగర్, జడ్చర్ల పట్టణాలలో బీపీ, షుగర్ బాధితులు ఉన్నారు. ప్రభుత్వం ఎన్‌సీడీ క్లినిక్‌ల ద్వారా వారికి వైద్య సేవలు అందిస్తోంది.

జిల్లాల వారీగా షుగర్ వ్యాధిగ్రస్థులు

జిల్లా	బాధితులు
మహబూబ్‌నగర్	46,648
వనపర్తి	20,387
గద్వాల	23,104
నారాయణపేట	26,638
నాగర్‌కర్నూల్	35,606

ఏడాదిలో 9,402 మందికి..

జిల్లాలో షుగర్ వ్యాధిగ్రస్తులు విపరీతంగా పెరుగుతున్నారు. గత ఏడాది 38,246 మంది బాధితులు ఉంటే, ఈ ఏడాది మరో 9,402 మంది పెరిగారు. వంశపారంపర్యంగా, ఆహారపు అలవాట్లు, శారీరక శ్రమ లేకపోవడం వల్ల ఇది సోకుతుంది.

ఎన్‌సీడీ క్లీనిక్‌ల ద్వారా వైద్య సేవలు

బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు వైద్య సిబ్బంది గతంలో 104 వాహనాల్లో గ్రామాలకు వచ్చి మందులు ఇచ్చే వారు. ప్రస్తుతం ఈ కార్యక్రమాన్ని నిలిపేయడంతో ఎన్‌సీడీ క్లీనిక్‌లను అందుబాటులోకి తెచ్చారు. జనరల్ ఆస్పత్రి, జడ్చర్లలోని కమ్యూనిటీ ఆస్పత్రి, కోయిలకొండ కమ్యూనిటీ ఆస్పత్రిలో ఈ క్లీనిక్‌లను ఏర్పాటు చేశారు. అక్కడే పరీక్షలు చేసి, మందులు ఇస్తున్నారు. ఇదివరకు గుర్తించిన ప్రకారం ఈ క్లీనిక్‌ల ద్వారా 16,525 మంది మందులు వాడుతున్నారు.

వనపర్తిలో ప్రత్యేక కార్యక్రమం

వనపర్తి(ఆంధ్రజ్యోతి): వనపర్తి జిల్లాలో 20387 మంది షుగర్ వ్యాధిగ్రస్తులు మందులు వాడుతున్నారు. కలెక్టర్ చొరవతో జిల్లాలోని ఐదు పీహెచ్‌సీలో పరిధిలో ఈ నెల ఒకటి నుంచి ఇంటింటికి 30 ఏళ్ల పైబడిన వారు 14,698 మందికి పరీక్షలు చేశారు. 688 మందికి షుగర్ లెవల్స్ ఎక్కువ ఉన్నట్లు గుర్తించారు. రక్తం సేకరించి, పరీక్షలకు పంపించారు.

ట్రాఫిక్ సమస్యకు చెక్ పడేనా?

- మద్దూరులో ఇరుకైన పాత బస్టాండ్ చౌరస్తాతో ఇక్కట్లు



ఇరుకు చౌరస్తా వల్ల ఆగిపోయిన వాహనాలు

మద్దూర్, నవంబర్ 13 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా మద్దూరు మండల కేంద్రంలో ట్రాఫిక్ సమస్య రోజురోజుకు తీవ్రంగా మారుతోంది. పాతబస్టాండ్ చౌరస్తా ఇరుకుగా ఉండడంతో నలుదిక్కుల నుంచి వచ్చే వాహనాలు ముందుకు సాగని పరిస్థితులు చోటు చేసుకుంటుంది. వాహనాలు స్తంభించిపోయి వాహనదారులు, పాదాచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. ఈ సమస్యకు పరిష్కరం చూపాలని మండల వాసులు పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నారు. సమస్యలను దృష్టిలో పెట్టుకొని ఇటీవలే ప్రభుత్వం రోడ్డు విస్తరణ పనులకు శ్రీకారం చుట్టింది. ఈ సమస్యకు పరిష్కారమార్గం లభిస్తుందని భావించిన మండల ప్రజలకు కాంట్రాక్టర్ పనులు అసంపూర్తిగా వదిలేయడంతో మళ్లీ మొదటికొచ్చింది. ట్రాఫిక్ సమస్య నిత్యకృత్యమైందని పట్టణవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిలిచిన రోడ్డు పనులు త్వరలోనే ప్రారంభమవుతాయని అధికారులు చెప్పడం గమనార్హం.

చౌరస్తాను విస్తరించాలి

మద్దూర్ పాత బస్టాండ్ చౌరస్తా ఇరుకుగా ఉన్నందున వాహనాలకు ఇబ్బంది కలుగుతుంది. ట్రాఫిక్ జాం ఏర్పడి కదల్లేని పరిస్థితి ఏర్పడుతుంది. గురువారం సంత రోజు సమస్య మరీ తీవ్రంగా ఉంటుంది. ట్రాఫిక్ ఇబ్బందులను తప్పించాలి.

- అంజిలయ్య గౌడ్, మద్దూరు

విస్తరణ పనులు ముమ్మరం

- జానంపేట వద్ద కొనసాగుతున్న జాతీయ రహదారి పనులు
- ప్రమాదాల నివారణకు భూగర్భ వంతెనలు
- వంతెన నిర్మాణ ప్రాంతాన్ని మార్చాలంటున్న ప్రజలు



వేముల స్టేజీ వద్ద కొనసాగుతున్న పనులు

మూసాపేట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాల నివారణ కోసం ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు ప్రమాదకరైన ప్రదేశాలను గుర్తించి అక్కడ భూగర్భ వంతెన నిర్మాణాలు చేపడుతున్నారు. ఈ వంతెన నిర్మాణాల కోసం మొదటగా వేముల స్టేజీ వద్ద రోడ్డుకు ఇరువైపులా ఉపరోడ్డు నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కొత్తూరు నుంచి అలంపూర్ వరకు 180 కి.మీ వరకు 44వ జాతీయ రహదారి విస్తరించి ఉండగా, మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల నుంచి వనపర్తి జిల్లా కొత్తకోట పరిధిలో సుమారు 55 కిలోమీటర్ల రహదారి ఉండగా, ఇందులో 14 బ్లాక్ స్పాట్లను జాతీయ రహదారి అధికారులు గుర్తించారు. మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలం శేరిపల్లి(బి), మూసాపేట మండలం జానంపేట, వేములస్టేజీ, వనపర్తి జిల్లా కొత్తకోట మండలం కనిమెట్ట, పెద్దమందడి మండలం వెల్టూర్ స్టేజీ వద్ద అండర్‌గ్రౌండ్(భూగర్భ వంతెన నిర్మాణాలు) చేయడానికి శ్రీకారం చుట్టారు. టెండర్లు సైతం చేపట్టగా, ప్రస్తుతం వేములస్టేజీ, మూసాపేట వద్ద పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఈ వంతెన నిర్మాణం పూర్తయితే రహదారి రూపురేఖలు మారి, రోడ్డు ప్రమాదాలు తగ్గే అవకాశం ఉందని స్థానికులు అంటున్నారు. వేముల స్టేజీ వద్ద ఉప రోడ్డు నిర్మాణం కోసం కొలతలు చేసి ప్రస్తుతం ఉన్న రహదారి డివైడర్‌కు ఇరువైపులా 30 మీటర్ల మేరకు మార్కింగ్ చేశారు. ఉప రోడ్డు పనులను ఇరువైపులా చేపడుతున్నారు.

దేశాభివృద్ధిలో యువత భాగస్వామ్యం కావాలి



పీయూ వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న పీయూ ఎన్ఎస్ఎస్ అధికారులు

● వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్

పాలమూరు యూనివర్సిటీ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): దేశాభివృద్ధిలో యువత భాగస్వాములు కావాలని పీయూ వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్ అన్నారు. బుధవారం లైబ్రరీ ఆడిటోరియంలో ఎన్ఎస్ఎస్ సెల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఒరియంటేషన్ ప్రోగ్రాంకు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. జాతీయ సేవా పథకం భారత దేశంలో విద్యార్థుల కోసం రూపొందించిన ఒక స్వచ్ఛంద సేవ ప్రణాళిక అన్నారు. అనంతరం ముఖ్యవక్త డాక్టర్ శ్రీనాథచారి మాట్లాడుతూ చదువు సంపద సృష్టించి, సంస్కారం నేర్పాలన్నారు. యువత ఒక మంచి లక్ష్యం కోసం పనిచేయాలని చెప్పారు. రిసోర్స్ పర్సన్ డాక్టర్ భూమయ్య మాట్లాడుతూ జాతీయసేవ పథకాన్ని 1969లో కేంద్రయువజన శాఖ ఆధ్వర్యంలో ప్రారంభించారని అన్నారు. కొఠారా కమిషన్ సూచన మేరకు యూనివర్సిటీ స్థాయిలో ఎన్ఎస్ఎస్ ఉండాలని ప్రతిపాదించిందని తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ మధుసూదన్‌రెడ్డి, ప్రిన్సిపాల్స్ డాక్టర్ చంద్రకిరణ్, డాక్టర్ నూర్జహన్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ కె. ప్రవీణ తదితరులు పాల్గొన్నారు.

పీయూ రిజిస్ట్రార్‌గా ప్రొఫెసర్ చెన్నప్ప



పాలమూరు యూనివర్సిటీ రిజిస్ట్రార్‌గా ప్రొపెసర్ చెన్నప్పని నియమితులయ్యారు. ఆ ఉత్తర్వులను గురువారం పీయూ వీసీ ప్రొపెసర్ జీఎన్ శ్రీనివాస్ జారీ చేశారు. పీయూ ఏడవ రిజిస్ట్రార్‌గా నేడు బాధ్యతలు స్వీకరించనున్నారు. ప్రస్తుతం ఉస్మానియా యూనివర్సిటీలో వాణిజ్య విభాగం విభాగాధిపతిగా, శాతవాహన యూనివర్సిటీ, పాలయూరు యూనివర్సిటీకి డీన్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

తెలంగాణ ఉద్యమకారులపై

కొనసాగుతున్న కేసులు

» కేసుల మాఫీకి జీవో జారీ చేసిన ప్రభుత్వం » పూర్తి స్థాయిలో అమలు కాని జీవో

» పెండింగ్‌లో సకల జనుల సమ్మె కేసులు

పాలమూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న పలువురు ఉద్యమకారులపై నమోదైన కేసులు ఇంకా కొనసాగుతున్నాయి. ఈ ఏడాది ఆగస్టులో వారికి సమన్లు అందడంతో సమస్య మరో సారి తెరపైకి వచ్చింది. నీళ్లు, నిధులు, నియామకాలే లక్ష్యంగా, ప్రత్యేక రాష్ట్ర సాధనే ధ్యేయంగా 2001 నుంచి 2014 వరకు తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసిపడింది. రాష్ట్రంలోని అన్ని కుల సంఘాలు, రాజకీయ పార్టీల నాయకులు జేఏసీగా ఏర్పడి వివిధ రూపాల్లో కొనసాగించిన పోరులో ఉమ్మడి పాలమూరు జిల్లా ఉద్యోగులు, ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు. టీజేఏసీ మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లా చైర్మన్‌గా జి.రాజేందర్‌రెడ్డి వ్యవహరించారు. సాగరహారం, మిలియన్ మార్చ్, సకల జనుల సమ్మె తదితరాల్లో ఉమ్మడి జిల్లాకు చెందిన వివిధ శాఖల ఉద్యోగులు, ప్రజలు మమేకమయ్యారు. ఈ సందర్భంగా పలువురు టీజేఏసీ నాయకులు, ఉద్యమకారులపై అప్పటి ప్రభుత్వం కేసులు నమోదు చేసింది. అదే సమయంలో తెలంగాణ రాష్ట్ర సమితి వ్యవస్థాపక అధ్యక్షుడిగా కేసీఆర్ నాయకత్వంలో ఎంపీలు, ఎమ్మెల్యేలు అనేక మార్లు రాజీనామాలు చేసి, ఉప ఎన్నికల్లో పోటీ చేశారు. ఉద్యమ స్ఫూర్తితో తెలంగాణ ప్రజలు వారిని గెలిపించారు. ఈ క్రమంలో 2014, జూన్ రెండున తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించింది. ఆ వెంటనే వచ్చిన ఎన్నికల్లో టీఆర్ఎస్ విజయం సాధించింది. అనంతరం ఉద్యమకారులపై కేసులను మాఫీ చేసేందుకు ప్రత్యేక జీవోను విడుదల చేసింది. దీని ప్రకారం ఎంత మందిపై, ఎలాంటి కేసులు ఉన్నాయో జిల్లాల వారీగా ఎస్పీల నుంచి డీజీపీకి నివేదిక సమర్పించారు. వాటన్నింటినీ న్యాయస్థానంలో ఒకే సారి మాఫీ చేశారు. కానీ మహబూబ్‌నగర్ జిల్లాలో పోలీసు శాఖ తన పరిధిలోని కొన్ని కేసులను స్పష్టంగా నివేదించలేదు. దీంతో సకల జనుల సమ్మెకు సంబంధించిన కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ఆ ఉద్యమంలో పాల్గొన్న 34 మందిపై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసినా, వారిలో ఆరుగురిని గుర్తించలేకపోయారు. మిగిలిన 28 మందిపై కేసు ఇప్పటికీ పెండింగ్ ఉంది. వారికి 2022, సెప్టెంబరు 21న అప్పటి ప్రభుత్వం మొదటి సారి సమన్లు జారీ చేసింది. ఈ ఏడాది ఆగస్టు ఒకటిన పోలీసులు వారికి సమన్లను అందించారు. అంటే జారీ అయిన తర్వాత సమన్లను అందించేందుకు రెండేళ్ల కాలం పట్టిందని ఉద్యమకారులు చెప్తున్నారు.



ఉద్యమ సమయంలో మహబూబ్‌నగర్‌లో జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడుతున్న కోదండరాం, చిత్రంలో కేసీఆర్, కిషన్‌రెడ్డి తదితరులు

చార్జిషీట్‌లో ఉన్న వారి పేర్లు

ఏ1 బి.చంద్రకాంత్‌రెడ్డి, ఏ2 చంద్రానాయక్, ఏ3 సత్తయ్య, ఏ4 రాములు, ఏ5 కొత్తూరు వెంకట్‌రెడ్డి, ఏ6 మీర్ అజమ్‌అలీ, ఏ7 కె.జగన్‌రత్నం, ఏ8 వి.ఎస్ నారాయణ, ఏ9 యాదయ్య, ఏ10 ప్యాట నరసింహరెడ్డి, ఏ11 కె.శివరాములు, ఏ12 సయ్యద్ రియాజుద్దీన్, ఏ13 వెంకటేష్‌ప్రసాద్, ఏ14 లక్ష్మణ్, ఏ15 వెంకటయ్య, ఏ16 నాగభూషణం, ఏ17 వి.అశోక్, ఏ18 మాణిక్‌బాబు, ఏ19 కె.మధు, ఏ20 బి.శివన్న, ఏ21 కె.బాలచందర్, ఏ22 బి.నరసింహులు, ఏ23 పి.రవికుమార్, ఏ24 కె.మోయినొద్దీన్, ఏ25 కె.ఎల్ డేవిడ్, ఏ26 ఏ.బాలరాజు, ఏ27 లక్ష్మణ్, ఏ28 జె.రామస్వామి, ఏ29 వి.పుష్పలత, ఏ30 పి.శివలీల, ఏ31 యం.శివరత్నమ్మ, ఏ32 బి.చంద్రకళ, ఏ33 వి.మద్దిలేటి, ఏ34 జక్క గోపాల్

పోలీసు శాఖ తప్పిదమే



జి.రాజేందర్‌రెడ్డి, టీజేఏసీ చైర్మన్ పాత జిల్లా : తెలంగాణ ఉద్యమకారులపై ఉన్న కేసులన్నింటినీ మాఫీ చేసేందుకు అప్పటి ప్రభుత్వం జీవో జారీ చేసింది. మహబూబ్‌నగర్ జిల్లా పోలీసులు కేసులను స్పష్టంగా చూపకపోవడం, కొన్ని కేసులను విస్మరించడంతో అవి పెండింగ్‌లో ఉన్నాయి. ఈ కేసులకు సంబంధించి 2022లో 28 మందికి సమన్లు జారీ చేసి, రెండేళ్లకు వాళ్లకు అందించడం మరింత ఆశ్చర్యం.

తప్పకుండా కేసులు మాఫీ అవుతాయి



ఆర్.చంద్రానాయక్ : సకల ఉద్యోగుల సమ్మెలో ఆర్టీసీ కార్మికులకు మద్దతుగా ఆందోళనలో పాల్గొన్నాం. 2011లో సమ్మె చేస్తే, 2022లో పోలీసుల చార్జిషీట్ వేయటం బాధాకరం. దీనికి సంబంధించి 2022లో సమన్లు జారీ అయ్యాయి. కానీ రెండేళ్ల తర్వాత వాటిని ఉద్యమకారులకు అందించారు. ప్రస్తుత ప్రజా ప్రభుత్వం కొనసాగుతోంది కాబట్టి, కేసు మాఫీ అవుతుందనే నమ్మకం ఉంది.

నోటీసుల కలకలం



(మొదటి పేజీ తరువాయి)

విచారణ చేసే దిశగా అడుగులు వేస్తున్నారా, ఆంధ్రజ్యోతి పత్రికలో గతంలోనే ఫోన్ ట్యాపింగ్ కేసులో పాలమూరుకు లింకులు అనే విషయంపై వచ్చిన కథనాలు నిజమేనని తేలుతున్నాయా అంటే అవుననే సమాధానం వస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అత్యంత వేగంగా ప్రారంభమై తర్వాత స్తబ్దుగా మారిపోయిన ఫోన్ ట్యాపింగ్ కేసులో ఇన్నాళ్లు అప్పటి పోలీసు అధికారుల పాత్రను గుర్తించి అరెస్టు చేయగా ఇప్పుడు ఇక అప్పటి ప్రజాప్రతినిధుల పాత్రపై దృష్టి సారించారు. ఇప్పటికే కావాల్సినంత సమాచారం సేకరించుకొని విచారణ చేపట్టే పనిలో నిమగ్నమయ్యారు. అందులో భాగంగా ఉమ్మడి నల్గొండ జిల్లా నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యకు ఇప్పటికే నోటీసులు జారీ చేయగా ఉమ్మడి పాలమూరు జిల్లాలో కూడా నలుగురు మాజీలకు మొదటి దశలో నోటీసులు జారీ చేయనున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే వీరిలో ఇద్దరు ఎమ్మెల్యేలకు సంబంధించిన నోటీసులను సిద్ధం చేసినట్లు సమాచారం. అయితే కేవలం అనుకుంటున్న ఈ నలుగురేనా, లేక ఉమ్మడి జిల్లాలో ఇంకా చాలామంది మాజీలు ఫోన్ ట్యాపింగ్‌ను వాడుకొని రాజకీయాలు చేశారా అనేది తేలాల్సి ఉంది. అయితే ఒక్కసారి నోటీసులు వచ్చిన తర్వాత ఇది అధికార, ప్రతిపక్షాల మధ్య తీవ్ర వాగ్యుద్ధానికి దారితీసే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

మొదటి నుంచీ ఆరోపణలు

బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు తమకు నచ్చని వారిపై, రాజకీయ ప్రత్యర్థులపై, ఇతర పార్టీల సానుభూతిపరులపై నిఘా ఉంచినట్లు బహిరంగాగానే ఆరోపణలు వినిపించాయి. అప్పటి ఎమ్మెల్యేలు, మంత్రులు ప్రతిపక్ష నాయకుల మాటలు వినడానికి, వారికి సహకరించే వారిని బెదిరించడానికి ఈ ఫోన్ ట్యాపింగ్‌ను ఉపయోగించారనే అనుమానాలూ ఉన్నాయి. ఆయా నియోజకవర్గాల్లో ప్రత్యేకంగా వార్ రూమ్‌లు ఏర్పాటు చేసుకొని తమకు అనుకూలంగా ఉండే పోలీసు అధికారుల నేతృత్వంలో ఈ ప్రత్యేక బెదిరింపులు కొనసాగాయనే విమర్శలు వచ్చాయి. గతంలో మహబూబ్‌నగర్ రూరల్ మండలానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు ఫోన్‌లో మాట్లాడిన సంభాషణ వినడం ద్వారానే ఆయనపై దాడి చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. అలాగే రియల్ ఎస్టేట్ వ్యాపారులను బెదిరించడం, ప్రజాప్రతినిధుల అండ చూసుకొని కొందరు పోలీసు అధికారులు సొంత సెటిల్‌మెంట్లు చేశారనే విమర్శలు ఉన్నాయి. ఈ విషయాలపై మార్చిలో మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి నేరుగా డీజీపీ రవిగుప్తకు ఫిర్యాదు చేయగా పలువురు నాయకులు, గతంలో ఫోన్ ట్యాపింగ్ వల్ల ఇబ్బందులు పడ్డామని భావించిన చాలా మంది వారి సమీపంలో ఉన్న పోలీసు స్టేషన్లలో ఫిర్యాదులు చేశారు. అయితే అప్పుడు ఫోన్ ట్యాపింగ్ వ్యవహారాన్ని కేవలం రాష్ట్ర స్థాయి వరకే పరిమితం చేయగా జిల్లాలకు విస్తరించాలని విన్నపాలు వచ్చాయి. అయితే ఇప్పుడు ఇస్తున్న నోటీసులు జిల్లాకు సంబంధించిన విచారణలో భాగంగా ఇస్తున్నారా, లేక రాష్ట్రస్థాయి విచారణలో భాగమా అనేది తేలాల్సి ఉంది.

ఎల్ఐసీని కాపాడుకోవటం అందరి బాధ్యత



కార్యక్రమంలో మాట్లాడుతున్న రాజేశ్వర్

● ఐసీఈయూ హైదరాబాద్ డివిజన్ ఉపాధ్యక్షుడు రాజేశ్వర్

పాలమూరు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వరంగ సంస్థ ఎల్ఐసీని కాపాడుకోవటం మనందరి బాధ్యత అని ఐసీఈయూ హైదరాబాద్ డివిజన్ ఉపాధ్యక్షుడు వి.రాజేశ్వర్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో ప్రభుత్వ రంగ సంస్థ ఎల్ఐసీని కాపాడుకోవాలని, పటిష్టపరచాలని ఎల్ఐసీ ఉద్యోగుల కళాజాత ప్రదర్శన నిర్వహించారు. పూర్తిగా ఎల్ఐసీ ఉద్యోగుల చేత నిర్వహించిన ప్రదర్శన ఆకట్టుకోవటంతోపాటు ఆలోచింపచేసింది. ఎల్ఐసీని బలపరచాలని హైదరాబాద్, సికింద్రాబాద్ డివిజన్ల ఆధ్వర్యంలో కళాజాత ప్రదర్శన హైదరాబాద్ నుంచి ప్రారంభించి మహబూబ్‌నగర్‌కు చేరుకుందన్నారు. సౌత్‌సెంట్రల్‌జోన్ ఇన్‌సవాను ఎంప్లాయిస్ ఫెడరేషన్ జాయింట్ సెక్రెటరీ జి.తిరుపతయ్య సారథ్యం వహించారు. న్యూటౌన్, మల్లికార్జున ఎంటర్‌ప్రైజెస్ దగ్గర ప్రజల డబ్బు, ప్రజల వినియోగం కోసం అనే నినాదంతో ఎల్ఐసీ విశిష్టతను, ప్రభుత్వ రంగాల ప్రాముఖ్యతను వివరించారు. కళాజాతలో వివిధ రంగాల ఉద్యోగులు, ఉపాధ్యక్షుడు, ఇన్సూరెన్స్ ఉద్యోగులు సంఘం, కరుణాకర్ గౌడ్, ఎల్.మద్దిలేటి, గిరిధర్, గోవర్ధన్‌రెడ్డి, శ్రీనివాసన్, రాజేష్, సుజాత, ఝాన్సీ, రజిత, అరుణ, వరలక్ష్మి, రమణి, చక్రపాణి, గణేష్, సాయిబాబా, రఘు, రాములు, ఆనంద్, సత్యనారాయణ, శ్రీనివాసులు, సీఐటీయూ కురుమూర్తి, యూటీఎఫ్ రవికుమార్, ఐఎన్‌టీయూసీ రాములుయాదవ్, టీయూసీ సి.వెంకటేష్, ప్రశాంత్, భరత్ పాల్గొన్నారు.

రోడ్డు పక్కనున్న చెట్లు నరికివేత



రోడ్డు పక్కల చెట్లను నరికి వేసిన అధికారులు

వీపనగండ్ల, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన వీపనగండ్ల, తూముకుంట మధ్య రోడ్డుపై ఉన్న 160 హరితహారం చెట్లను విద్యుత్‌శాఖ అధికారులు నరికి వేశారు. దాదాపు పది సంవత్సరాలు క్రితం వేల రూపాయలు ఖర్చు చేసి మొక్కలు నాటి పెంచి పోషించారు ఇటీవలనే విద్యుత్ శాఖ అధికారులు కొత్తగా స్తంభాలు నాటి విద్యుత్ లైన్ ఏర్పాటు చేశారు. విద్యుత్ లైన్‌కు ఆటంకంగా చెట్లు ఉన్నాయని ఉద్దేశంతో ఎలాంటి అనుమతులు లేకుండా సగానికి నరికి వేశారు. దీనితో వేలాది రూపాయలు దుర్వినియోగం అయ్యింది. ప్రభుత్వ అధికారులే ఇలా నరికి వేస్తే వేరే వారి పరిస్థితి ఎలా ఉంటుందని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. చెట్ల నరికివేతపై ఎంపీడీవో శ్రీనివాసరావును వివరణ కోరగా తాను పరిశీలించి తదుపరి నిర్ణయం తీసుకుంటానని తెలిపారు.

రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో మోడల్ స్కూల్ విద్యార్థులు

పెబ్బేరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో జరిగిన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలలో ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా జట్టు తరఫున అండర్ 17 విభాగంలో శ్రీకాంత్, 14 విభాగంలో పరుశరాములు ప్రతిభ కనబరిచారు. పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ నరేష్, వైస్ ప్రిన్సిపాల్, ఫిజికల్ డైరెక్టర్, ఉపాధ్యాయ బృందం విద్యార్థులను అభినందించారు.

గద్వాల మార్కెట్‌కు

పోటెత్తుతున్న ధాన్యం

- ప్రభుత్వం రూ.500 బోనస్ ఇస్తామన్నా ప్రైవేటుకే మొగ్గు చూపుతున్న రైతులు



ప్రకటించిన ధరను ధాన్యం కుప్పపై ఉంచిన వ్యాపారులు



ధాన్యం తూకం చేస్తున్న కూలీలు

గద్వాల, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): గద్వాల వ్యవసాయ మార్కెట్‌కు ధాన్యం పోటెత్తుతోంది. రాష్ట్ర ప్రభుత్వం సన్న రకం వడ్లకు మద్దతు ధరతో పాటు క్వింటాలుకు రూ.500 బోనస్ ప్రకటించినా రైతులు ప్రైవేట్‌లో విక్రయించేందుకు మొగ్గు చూపుతున్నారు. ప్రతీరోజు మార్కెట్‌కు సన్నరకం వడ్లు 1,800 బస్తాల నుంచి రెండువేల బస్తాల వరకు వస్తోంది. కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడం, ప్రారంభించినా కొనుగోలు చేయకోవడం, అందుబాటులో కేంద్రాలు లేకపోవడం అనేక కారణాలతో వ్యవసాయ మార్కెట్‌కు ధాన్యం వస్తోంది. ఇదే అదునుగా భావిస్తున్న వ్యాపారులు మద్దతు ధరకంటే తక్కువ ధరకు ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. జిల్లాలో 60 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని నిర్ణయించగా ఇప్పటి వరకు 20 మాత్రమే ప్రారంభించారు. కానీ ఒక్క గింజను కూడా కొనుగోలు చేయలేదు. వారం రోజులుగా మార్కెట్ వస్తున్న ధాన్యాన్ని పరిశీలిస్తే ఏడో తేదీన 919 బస్తాలు, ఎనిమిదిన 1,907బస్తాలు, తొమ్మిదిన 1,484బస్తాలు, 10వ తేదీన 1,848 బస్తాలు, 11వ తేదీన 1,810 బస్తాలు, 12న 1,726 బస్తాల ధాన్యం మార్కెట్‌కు వచ్చింది. రైతులు మద్దతు ధరకంటే తక్కువ ధరకు విక్రయిస్తూ... నష్టపోతున్నారు. మద్దతు ధరతో పాటు ప్రభుత్వం ఇచ్చే బోనస్ కూడా రైతులు కోల్పోతున్నారు. కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాలేదని, మార్కెట్‌లో విక్రయించినా రోజే నగదు ఇస్తున్నారని, అందుకే ధాన్యాన్ని మార్కెట్‌లో విక్రయిస్తున్నామని రైతులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. కొనుగోలు కేంద్రాల్లో విక్రయించినా మూడు రోజుల్లో రైతుల ఖాతాలలో డబ్బులు జమ అవుతాయనే విషయాలపై అవగాహన కల్పించడంలో అధికారులు విఫలం అవుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

జిల్లాలో 1.40 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి

జిల్లాలో దాదాపు 94వేల ఎకరాలలో వరిని సాగు చేశారు. దాదాపు 1.40లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అధికారులు అంచనా వేశారు. అందులో 90శాతం సన్నరకాలు పండించారు. ప్రభుత్వం ఏ గ్రేడ్‌కు రూ.2,320, సాధారణ గ్రేడ్‌కు రూ.2,300లను ప్రకటించింది. అదేవిధంగా సన్నరకం వడ్లకు క్వింటాలుపై రూ.500బోనస్ ఇస్తామని ప్రకటించింది. దాదాపు క్వింటాలుకు రూ.2,800లను పొందే అవకాశం ఉంది. కొనుగోలు కేంద్రాలు అందుబాటులో లేకపోవడంతో రైతులు ప్రైవేట్‌లో విక్రయించి నష్టపోతున్నారు. అధికారులు స్పందించి వెంటనే కొనుగోళ్లు ప్రారంభించి రైతులకు మేలు చేయాలని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

కొనుగోలు కేంద్రం లేదు



మూడు ఎకరాలలో సన్నరకం వరి పండించాను. మా దగ్గర కొనుగోలు కేంద్రాలు లేవు. అందుకే నేరుగా మార్కెట్‌కు తీసుకవచ్చాను. క్వింటాలు ధర రూ.2100లకు అమ్ముడుపోయింది. బోనస్ వస్తుందని మాకు తెలియదు.

- నర్సింహులు, రైతు గంగిమాన్‌దొడ్డి, గట్టు మండలం

ఎప్పుడు ప్రారంభిస్తారో తెలియదు



నాలుగు ఎకరాల్లో వరి పండించాను. కొనుగోలు కేంద్రం లేదు. ఎప్పుడు ప్రారంభిస్తారో తెలియదు. క్వింటాలు రూ.2,080లకు విక్రయించాను. ధర తక్కువ వచ్చినా పచ్చి వడ్లు తూకం వస్తుందని అమ్మేశాను. బోనస్ కోసం ఉంటే తేమశాతం తగ్గి తూకంలో నష్టపోతాను.

- బడెన్న, రైతు తాటికుంట, మల్దకల్ మండలం

రైతులు ఎక్కడైనా అమ్ముకోవచ్చు

మేము ఈ రోజు వరకు 20కి పైగా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాం. రైతులు ఇప్పటి వరకు కేంద్రాలకు ధాన్యం తీసుకురాలేదు. రైతులు ధాన్యాన్ని ఎక్కడైన అమ్ముకునే స్వేచ్ఛ ఉంది. కొనుగోలు కేంద్రాల్లో విక్రయిస్తేనే మద్దతు ధర, సన్నాలకు బోనస్ వస్తుంది.

- స్వామికుమార్, జిల్లా సివిల్ సప్లయ్ అధికారి

దివ్యాంగులకు కనీస పెన్షన్

రూ.10 వేలకు పెంచాలి

● ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అడివయ్య



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అడివయ్య

వనపర్తి టౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం దివ్యాంగుల కనీస పెన్షన్ రూ.10వేలకు పెంచాలని దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అడివయ్య డిమాండ్ చేశారు. దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక వనపర్తి, నాగర్‌కర్నూల్ జిల్లా కమిటీల ఉమ్మడి సమావేశం రాష్ట్ర సహాయ కార్యదర్శి బాలేశ్వర్ అధ్యక్షతన బుధవారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన ఆయన మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికలలో ఇచ్చిన రూ.6వేల పెన్షన్ పెంపు హామీ వెంటనే అమలు చేయాలని, పెన్షన్ పెంచకుండా రాష్ట్ర ప్రభుత్వం ఆసరా లబ్ధిదారులను మోసం చేస్తుందని విమర్శించారు. నామినేటెడ్ పదవుల్లో వికలాంగులకు రిజర్వేషన్స్ అమలు చేస్తూ పార్లమెంట్‌లో చట్టం చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎన్‌పీఆర్‌డీ సహాయ కార్యదర్శి బాలేశ్వర్, జిల్లా అధ్యక్షుడు ప్రభుస్వామి, కార్యదర్శి నరసింహులు, వనపర్తి, నాగర్‌కర్నూల్ జిల్లాల నాయకులు కుర్మయ్య, లక్ష్మి, మంగమ్మ, భాగ్యలక్ష్మి, మల్లెపు నరసింహ, లింగం గౌడ్, కుర్మన్న, చంద్రశేఖర్, శివశంకర్, శ్రీశైలం, బంగారయ్య, గణేష్, చిట్టెమ్మ, కృష్ణవేణి, తిరుపతయ్య గౌడ్, నిఖిల్ కుమార్, ఎల్లమ్మలతో పాటు వివిధ మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జిల్లా నేతల 'మహా' ప్రచారం

- ఎంపీ మల్లురవి ఆధ్వర్యంలో కొనసాగుతున్న ప్రచారం
- గెలుపే లక్ష్యంగా పని చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు

నాగర్‌కర్నూల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : పక్క రాష్ట్రం మహారాష్ట్రలో నాగర్‌కర్నూల్ జిల్లా నాయకులు హడావిడి చేస్తున్నారు. మహారాష్ట్రలో గెలుపే లక్ష్యంగా పావులు కదుపుతున్న కాంగ్రెస్ అధిష్ఠానం తెలంగాణకు చెందిన కాంగ్రెస్ ఎంపీలు, ఎమ్మెల్యేలను ప్రచారంలోకి దించింది. ఈ క్రమంలో నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యుడు మల్లురవి ఆధ్వర్యంలో జిల్లా కాంగ్రెస్ ఎమ్మెల్యేల బృందం రంగంలోకి దిగింది. యావత్మల్ పార్లమెంట్ నియోజకవర్గంలో మూడు చోట్ల కాంగ్రెస్ అభ్యర్థులు రంగంలోకి దిగారు. వీరి గెలుపు కోసం పార్లమెంట్ నియోజకవర్గంలోని ఎమ్మెల్యేలు డాక్టర్ వంశీకృష్ణ, కూచకుళ్ల రాజేష్‌రెడ్డి, మెగారెడ్డితోపాటు మైనార్టీ కార్పొరేషన్ ఒబెదుల్లా కొత్వాల్ కూడా కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు కోసం ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నారు.

తెలంగాణలో ఆరు గ్యారెంటీలు మహారాష్ట్రలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడితే ఆచరణలోకి రాబోయే పంచసూత్రాల గురించి విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. మహారాష్ట్రలో 20న పోలింగ్ జరగనుండడంతో 18న జిల్లా నాయకులు తిరిగి రానున్నారు.



మహారాష్ట్రలో సమన్వయ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ మల్లు రవి

సరైన యాజమాన్యంతో..

వేరుశనగ సాగు లాభదాయకం

-ఏడీఆర్ డాక్టర్ వెంకటయ్య



పాలెం ఆర్ఏఆర్ఎస్‌లో రైతులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఏడీఆర్ డాక్టర్ వెంకటయ్య

బిజినేపల్లి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : వేరుశనగ పంట సాగులో సరైన యాజమాన్య పద్ధతులను పాటిస్తే అధిక దిగుబడి పొంది లాభాలను ఆర్జించవచ్చని ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ డాక్టర్ వెంకటయ్య అన్నారు. మండలంలోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ పరిశోధన స్థానం పాలెంలో బుధవారం ఎర్రకుంట తండా రైతులకు వేరుశనగ సాగుపై వేరుశనగ పరిశోధన కేంద్రం, జునాఘడ్ వారి సహకారంతో శిక్షణ నిర్వహించి మాట్లాడారు. వేరుశనగ సాగులో ప్రధానంగా నాణ్యమైన విత్తన ఎంపిక, విత్తనశుద్ధి, సరైన సస్యరక్షణ పద్ధతులు, కలుపు యాజమాన్యం వంటి వాటిని పాటిస్తే అధిక ఉత్పత్తితో ఎక్కువ లాభాలను పొందవచ్చన్నారు. కార్యక్రమంలో నూనె గింజల ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ వాణిశ్రీ, వేరుశనగ విభాగం శాస్త్రవేత్తలు డాక్టర్ రాంరెడ్డి, డాక్టర్ స్రవంతి, డాక్టర్ నళిని, డాక్టర్ శంకర్, డాక్టర్ వి. దివ్యరాణి, 55 మంది రైతులు ఉన్నారు.

జూరాల కాలువకు

ఇరువైపులా జాలి

ప్రాణాంతకంగా మారిన జూరాల కాలువ అనే వార్తకు స్పందన



జూరాల ప్రధాన కాలువకు ఇరువైపులా జాలి ఏర్పాటు చేస్తున్న కూలీలు

పెబ్బేరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : గత నెల 27న ఆంధ్రజ్యోతి దిన పత్రికలో పెబ్బేరు పట్టణంలో ప్రాణాంతకంగా మారిన జూరాల కాల్వ అనే వార్తకు జూరాల అధికారులు స్పందించి దాదాపు 500 మీటర్లు ఇనుప జాలి ఏర్పాటు చేశారు. గతంలో టెండరు అయి జాలి ఏర్పాటు కాలేదు. ఆంధ్రజ్యోతిలో వచ్చిన వార్తకు అధికారులు స్పందించి జాలి ఏర్పాటు చేశారు. జూరాల ప్రధాన కాలువకు రూ. రెండు లక్షల ఇరవై వేలతో ఇనుప జాలి ఏర్పాటు చేశారు. దీనివల్ల సంత నుంచి వచ్చే బైపాస్ రోడ్డు వాహనదారులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు.

క్రైం కార్నర్

భార్యను కొట్టి చంపిన భర్త

» తలపై కర్రతో బాదడంతో మృతి

నవాబ్‌పేట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : తాగుడుకు అలవాటు పడిన భర్త వేధింపులు భరించలేక నిలదీసిన భార్యను అతడు కొట్టి చంపేశాడు. మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండల కేంద్రంలో ఈ సంఘటన జరిగింది. బాధిత కుటుంబసభ్యులు, ఎస్ఐ విక్రమ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నారాయణ పేట జిల్లా మద్దూర్ మండలం జాజ ర్‌పల్లికి చెందిన లక్ష్మి (30)కి 15 సంవత్సరాల క్రితం మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండల కేంద్రానికి చెందిన ఎరుకలి మల్లేష్‌తో వివాహమైంది. ఆ సమయంలో కట్నం కింద ఐదు తులాల బంగారం, లక్ష రూపాయలతో ఇంటి సామాను ఇచ్చారు. మూడేళ్ల వారి కాపురం సజావుగానే సాగింది. ఆ తర్వాత తాగుడుకు బానిసైన మల్లేశ్ లక్ష్మిని వేధించడం మొదలు పెట్టాడు. అతడి వేధింపులు భరించలేక ఈ నెల 12న రాత్రి గొడవ జరిగింది. ఎందుకు తాగుతున్నావంటూ నిలదీసింది. దీంతో అతడు లక్ష్మి తలపై కర్రతో బలంగా మోదడంతో అక్కడికక్కడే మృతి చెందింది. 13న ఉదయం మల్లేశ్ బంధువు ఒకరు లక్ష్మి సోదరుడు నగేశ్‌కు ఫోన్ చేశాడు. మీ చెల్లెలు చనిపోయిందని చెప్పాడు. నగేశ్ వెంటనే అక్కడికి చేరుకొని చూడగా లక్ష్మి రక్తగాయాలతో మృతి చెంది కనిపించింది. ఈ మేరకు అతడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మల్లేశ్‌కు కన్మన్ కాలువ గ్రామానికి చెందిన ఓ మహిళతో వివాహేతర సంబంధం ఉందని తన చెల్లి గతంలో చెప్పిందని ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విక్రం తెలిపారు. మృతురాలికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు.

రెండు ఇళ్లలో చోరీ

తాడూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలంలోని గుట్టలపల్లి గ్రామంలో మంగళవారం మధ్యాహ్నం రెండు ఇళ్లల్లో చోరీ జరిగింది. ఎస్ఐ గురుస్వామి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన శ్రీను, వెంకటయ్య ఇళ్లు పక్కపక్కనే ఉన్నాయి. మంగళవారం మధ్యాహ్నం వారు కుటుంబ సభ్యులతో కలిసి పొలం పనులకు వెళ్లారు. సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చే సరికి రెండు ఇళ్ల తాళాలు విరిగిపోయి ఉన్నాయి. తలుపులు చిలుకుపెట్టి ఉన్నాయి. దీంతో వారు లోనికి వెళ్లి చూడగా, ఇంట్లో సామాను చిందరవందరగా పడి ఉంది. పరిశీలించగా శ్రీని ఇంట్లో ఆరు తులాల వెండి, ఎనిమిది వేల రూపాయలు, వెంకటయ్య ఇంట్లో 16 తులాల వెండి చోరీకి గురైనట్లు గుర్తించారు. దీంతో వారిద్దరూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణలో అదే గ్రామానికి చెందిన శ్రీధర్ చోరీకి పాల్పడినట్లు తేలింది. నిందితుడిని బుధవారం కల్వకుర్తి కోర్టులో హాజరు పరిచి, రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

డ్రైనేజీలో పడి వ్యక్తి మృతి

మహబూబ్‌నగర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ పట్టణంలోని బ్రాహ్మణవాడిలో ఓ గుర్తు తెలియని వ్యక్తి (40) పడి చెందాడు. కాలనీకి చెందిన మహ్మద్ అక్బర్ బుధవారం ఉదయం 8:30 గంటలకు పిల్లలను బడికి తీసుకెళ్తుండగా ఒక వ్యక్తి డ్రైనేజీలో పడి ఉండటం గమనించాడు. చుట్టుపక్కల వారి సాయంతో అతడిని బయటకు తీసి పరిశీలించగా, అప్పటికే చనిపోయి ఉన్నాడు. దీంతో వారు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేరు మృతదేహాన్ని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మహిళ అదృశ్యం

మహబూబ్‌నగర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ పట్టణంలోని కురిహినిశెట్టి కాలనీకి చెందిన శివనీల (38) అదృశ్యమైంది. మంగళవారం బయటకు వెళ్లిన ఆమె ఇంటికి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ లభించకపోవడంతో బుధవారం ఆమె ఆడ పడుచు మిద్దె సరస్వతి వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. అయితే శివనీలకు మతిస్థిమితం సరిగా లేదని, రోజూ బయటకు వెళ్లి సాయంత్రం తిరిగి వచ్చేదని కుటుంబసభ్యులు తెలిపారు. మంగళవారం బయటకు వెళ్లిన ఆమె తిరిగి రాలేదని చెప్పారు.

గద్వాల చిన్నారుల..
కళానైపుణ్యం

» బాలభవన్ వేదికగా నాట్యంలో శిక్షణ - రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణింపు
» ఢిల్లీ నేషనల్ చైల్డ్ అసెంబ్లీలో ప్రదర్శన » నేడు బాలల దినోత్సవం



దీపిక

గద్వాల టౌన్, నారాయణపేట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా సంస్థానాధీశుల కాలం నుంచి, సాహితీ, కళా రంగాల్లో విద్వత్ గద్వాలగా ఖ్యాతి గడించింది. అలనాటి కీర్తిని, వారసత్వాన్ని కొనసాగిస్తూ జిల్లాకు చెందిన పలువురు చిన్నారులు తమ కళానైపుణ్యంతో జాతీయ స్థాయిలో గుర్తింపు పొందుతున్నారు. గద్వాల బాలభవన్ వేదికగా, ప్రముఖ కూచిపూడి నృత్యకారుడు పోలోజు సత్యం వద్ద శిక్షణ పొందుతున్న చిన్నారులు తమదైన ప్రతిభతో గుర్తింపును పొందుతూ గద్వాల పేరును మరోసారి కళారంగంలో మారుమోగేలా తమ వంతు కృషి సాగిస్తున్నారు. పిట్ట కొంచెం.. కూత ఘనం అన్న రీతిలో పాఠశాల స్థాయిలోనే నృత్యంలో ప్రతిభను చాటుతున్న ఈ చిన్నారులు గడచిన రెండుళ్లుగా ఢిల్లీ వేదికగా జాతీయ బాలభవన్ ఆధ్వర్యంలో నిర్వహించే నేషనల్ చైల్డ్ అసెంబ్లీలో పాల్గొని తమ నృత్య ప్రదర్శనతో నిర్వాహకులతో పాటు ఆహుతులను సైతం ఆకట్టుకుంటున్నారు. నేడు బాలల దినోత్సవం సందర్భంగా వారిలో కొందరి వివరాలు..

● కూచిపూడి నృత్యంలో నాలుగవ తరగతి నుంచి శిక్షణ పొందున్న దీపిక 2023, 2024లో ఢిల్లీలో నిర్వహించిన నేష నల్ చైల్డ్ అసెంబ్లీలో పాల్గొని నృత్య ప్రదర్శన ఇచ్చింది. నృత్యకారిణిగా జాతీయ స్థాయిలో రాణించి పేరు తెచ్చు కోవడం తన ఆకాంక్ష అని, తెలిపింది.



జ్యోత్స్నశ్రీ

● ఎనిమిదవ తరగతి విద్యార్థిని జోత్స్నశ్రీ ఐదేళ్లుగా బాలభవన్‌లో నృత్య శిక్షణ పొందుతోంది. ఢిల్లీలో ప్రతీ సంవత్సరం బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించే నేషనల్ చైల్డ్ అసెంబ్లీలో రెండు సార్లు ప్రదర్శన ఇచ్చింది. నృత్య కళాకారిణిగా గుర్తింపు తెచ్చుకోవాలన్నది తన ఆకాంక్షగా తెలిపింది.




సహస్ర

● ఎనిమిదవ తరగతి చదువుతున్న సహస్ర బాల్యం నుంచే నృత్య శిక్షణ పొందుతోంది. ఇప్పటికే రెండు సార్లు ఢిల్లీ వేదికగా నిర్వహించే నేషనల్ చైల్డ్ అసెంబ్లీలో పాల్గొని తన ప్రతిభతో అందరినీ ఆకట్టుకున్నది. నృత్యంలో మరింత సాధన చేసి జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకోవాలన్నదే లక్ష్యమని తెలిపింది.



పూజ్య శ్రీత,

● మూడవ తరగతి చదువుతున్న పూజ్య శ్రీత ఐదేళ్ల వయస్సు నుంచే నృత్యంలో శిక్షణ పొందింది. మహబూబ్‌నగర్ బాల కేంద్రంలో శిక్షణ పొందిన పూజ్య శ్రీత, తండ్రి ఉద్యోగం రీత్యా గద్వాలలో స్థిరపడి ఇక్కడే శిక్షణను కొనసాగిస్తోంది. ఇటీవల హైదరాబాద్‌లోని రవీంద్రభారతి, స్వర్ణగిరిలలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి నృత్య ప్రదర్శనల్లో పాల్గొని అందరి దృష్టిని ఆకర్షించింది. జాతీయ స్థాయిలో ప్రదర్శన ఇచ్చి మెప్పించాలన్నది తన లక్ష్యమని తెలిసింది.



జ్యోత్స్న

● మూడవ తరగతి నుంచే కూచిపూడి నృత్యంలో శిక్షణ పొందుతున్న జోత్స్న రెండు సార్లు ఢిల్లీలో నిర్వహించిన నేషనల్ చైల్డ్ అసెంబ్లీలో పాల్గొని తన ప్రదర్శనతో ఆకట్టుకున్నది. నృత్యకళాకారిణిగా రాణించడంతో పాటు, ఆసక్తి వున్న బాలికలకు నృత్య శిక్షణను ఇవ్వాలన్నది తన ఆసక్తిగా తెలిపింది.

ఎస్ఐ బదర్స్

మేనమామ వారికి స్ఫూర్తి

» ఎస్ఐ ఉద్యోగాలు సాధించిన సోదరులు
» తొలి ప్రయత్నంలోనే విజయం సాధించిన అన్న
» ఆటంకాలు ఎదురైనా లక్ష్యాన్ని మరువని తమ్ముడు
» మలి ప్రయత్నంలో కొలువుకు ఎంపిక



ఎస్ఐ బ్రదర్స్ విజయ్‌కుమార్, యుగంధర్

ఎర్రవల్లి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : : సాధారణ మధ్య తరగతి కుటుంబంలో జన్మించిన వారిద్దరూ పోలీస్ ఉద్యోగం చేసే మేన మామను చూసి స్ఫూర్తి పొందారు. పట్టుదలతో చదువుకొని, ఎస్ఐ ఉద్యో గం సాధించారు. వారే అన్నాదమ్ములు విజయ్‌కుమార్, యుగంధర్. వారిని గ్రామస్థులు సరదాగా 'ఎస్ఐ బ్రదర్స్' అంటూ ఉంటారు. జోగు ళాంబ గద్వాల జిల్లా ఎర్రవల్లి మండలంలోని శేకుపల్లి గ్రామానికి చెందిన వెంకటరెడ్డి, మాణిక్యమ్మల దంపతులకు ఇద్దరు కుమారులు విజయ్‌కుమార్, యుగంధర్ ఉన్నారు. వారిది సాధారణమైన వ్యవసాయ కుటుంబం. నిత్యం ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతూ కాలం వెళ్ల దీస్తున్న క్రమంలో చదువును కొనసాగలేని పరిస్థితి. అన్నాదమ్ములిద్దరూ చదువకుంటూనే సెలవుల్లో తల్లిదండ్రులకు పొలం పనుల్లో సాయం చేస్తూ ఉండేవారు. మేనమామ, పోలీస్ కానిస్టేబుల్ అయిన రాములు వారి ఇంటికి వస్తూ ఉండేవారు. వారు ఆయనను స్ఫూర్తిగా తీసుకున్నారు. ఎలాగైనా కష్టపడి పోలీసు ఉద్యోగం సాధించాలని కలలుగన్నారు. అందుకనుగుణంగా క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత విద్యాభ్యాసం చేశారు. విజయ్‌కుమార్ పీజీ వరకు చదువుకున్నాడు. తమ్ముడు యుగంధర్ ఆర్థిక సమస్యలతో ఏడవ తరగతితో చదువును నిలిపివేయాల్సి వచ్చింది. కానీ ఆయన తన లక్ష్యాన్ని మరచిపోలేదు. కానిస్టేబుల్ ఉద్యోగం కోసం నేరుగా పదవ తరగతి పరీక్షలు రాసి ఉత్తీర్ణుడయ్యాడు. కానీ ఆ ఉద్యోగానికి ఇంటర్మీడియట్ అర్హతగా మారడంతో మళ్లీ ఆయనకు సవాలు ఎదురయ్యింది. అయినా పట్టువదలకుండా ఇంటర్, డిగ్రీ చదవడంతో పాటు పీజీ కూడా పూర్తి చేశాడు. ఆ తర్వాత ఇద్దరూ కలిసి 2010లో ఎస్ఐ పరీక్ష రాశారు. అందులో విజయ్ విజేతగా నిలిచి ఎస్ఐ ఉద్యోగం సాధించాడు. కానీ ఆ ప్రయత్నంలో యుగంధర్ సత్ఫలితం సాధించలేకపోయాడు కానీ కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. వ్యక్తిగత కారణాలతో అతడు ఉద్యోగంలో చేరలేదు. 2012లో మళ్లీ ఎస్ఐ ఎంపిక పరీక్షలకు హాజరై కొలువు సాధించాడు. ప్రస్తుతం అన్న విజయ్‌కుమార్ హైదరాబాద్‌లోని బేగం బజార్ సీఐగా విధులు నిర్వర్తిస్తున్నారు. తమ్ముడు యుగంధర్ పెద్దమందడి ఎస్ఐగా కొనసాగుతున్నారు.

భారత్‌మాల
పనుల అడ్డగింత

» అండర్ పాస్ నిర్మించాలని గ్రామస్థుల డిమాండ్

గట్టు, నవంబరు 13 ఆంధ్రజ్యోతి : జోగు ళాంబ గద్వాల జిల్లా, గట్టు మండల పరిధిలోని తప్పెట్లమొర్సు వద్ద జరుగుతున్న భారత్‌మాల రహదారి పనులను బుధవారం గ్రామస్థులు అడ్డుకున్నారు. గ్రామం నుంచి ఎక్లాస్‌పురం వెళ్లే రహదారి వైపు వెళ్లేందుకు అదనంగా అండర్‌పాస్ రోడ్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే నక్ష ప్రకారం ఒక అండర్ పాస్ ఉన్నందున మరొక అండర్ పాస్ నిర్మించడం కుదరదని నాహి అధికారులు పేర్కొంటున్నారు. ఈ విషయంపై గ్రామస్థులు గతంలో పలుమార్లు ఆందోళన చేపట్టారు. కానీ అధికారులు స్పందించలేదు. దీంతో బుధవారం మరో మారు పనులను అడ్డుకొని సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. విషయం తెలుసుకున్న గట్టు ఎస్ఐ అక్కడికి చేరుకొని నచ్చచెప్పడంతో ఆందోళన విరమించారు.

ఉద్యోగాల పేరుతో..
రూ. 1.72 లక్షలు స్వాహా

నాగర్‌కర్నూల్ క్రైం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగాల పేరుతో ఓ వ్యక్తి నుంచి సైబర్ నేరగాళ్లు రూ. 1.72 లక్షలు స్వాహా చేశారు. ఎస్ఐ గోవర్ధన్ బుధవారం తెలిపాన వివరాలిలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ మునిసిపాలిటీ పరిధిలోని ఉయ్యాలవాడకు చెందిన మహ్మద్ హనీఫ్ గతంలో అమేజాన్ కంపెనీలో పని చేసేవాడు. ప్రస్తుతం వేరే పని చేస్తున్నాడు. ఉద్యోగం పేరుతో సైబర్ నేరగాళ్లు అతడిని నమ్మించి రూ.1.72 లక్షలు స్వాహా చేశారు. ఇంకా 70 వేలు కావాలని అడగడంతో అనుమానించి, పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

భక్తిశ్రద్ధలతో తులసీ కల్యాణం



తులసీ కల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

» వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు
» ప్రాంగణంలో ఉసిరికాయ దీపాలు వెలిగించిన మహిళలు

మహబూబ్‌నగర్ న్యూ టౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : కార్తీక ద్వాదశిని పురస్కరించుకొని బుధవారం మహబూబ్‌నగర్ పట్టణంలోని బ్రాహ్మణవాడి వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో తులసీ కల్యాణాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తులసి చెట్టుకు, ఉసిరి చెట్టుకు నిర్వహించిన కల్యాణ వేడుక కనుల పండువగా కొనసాగింది. కార్యక్రమానికి పట్టణం నలు మూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఉదయం నుంచి ఉపవాస దీక్ష చేపట్టిన భక్తులు, పూజల అనంతరం తీర్థ ప్రసాదాలు తీసుకొని దీక్షను విరమించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో మహిళలు రెండు వేల ఉసిరి కాయలతో తయారు చేసిన ప్రమిదలలో దీపాలు వెలిగించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు జి.వెంకటేశ్వర్లు, కోశాధికారి టి.నాగరాజు పాల్గొన్నారు.

ప్రతిష్టకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు

» సంబంధం లేని విషయాల్లో ఎమ్మెల్యే పేరును వాడుకోవడం సరికాదు
» వనపర్తి ఎమ్మెల్యే కార్యాలయం నుంచి ప్రకటన విడుదల

వనపర్తి టౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : వ్యక్తిగత సమస్యలు, వ్యక్తిగత విషయాలకు వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పేరును వాడుతూ, ప్రతిష్టకు భంగం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. నియోజకవర్గంతో పాటు, పట్టణానికి చెందిన కొందరు వ్యక్తులు వారి వ్యక్తిగత విషయాల్లో ఎమ్మెల్యే పేరును వాడుకుంటున్నారని పేర్కొన్నారు. ఇకపై ఇలాంటి సంఘటనలు పునరావృతం అయితే చట్టరీత్యా చర్యలు తీసుకోవాల్సి వస్తుందని తెలిపారు. ఇటీవల కొందరు వ్యక్తులు సోషల్ మీడియా వేదికగా భూ సంబంధిత, వ్యాపార లావాదేవీల విషయాల్లో ఎమ్మెల్యే పేరును ప్రస్తావించారని పేర్కొన్నారు. ఆ విషయాలతో ఎమ్మెల్యేకు ఎలాంటి సంబంధమూ లేదని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే పేరును వాడుకోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. వ్యాపార లావాదేవీలు పూర్తిగా వ్యక్తిగతమని, ఇలాంటి విషయాలకు పరిష్కార మార్గాలు అనేకం ఉంటాయని తెలిపారు. వారి వెసులుబాటుకు అనుగుణంగా పరిష్కరించుకునే మార్గాలు ఎంచుకోవాలి కానీ ఇతరులను బాధ్యులను చేయడం సరికాదని తెలిపారు. సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ప్రజల నుంచి ఎమ్మెల్యేకు వేలాది విన్నపాలు వస్తుంటాయని పేర్కొన్నారు. వాటిని న్యాయపరమైన మార్గాల్లో పరిష్కరించేందుకు ఎమ్మెల్యే కృషి చేస్తారని తెలిపారు.

వ్యక్తిగత విషయాలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినా స్పందించడం లేదంటూ ఆరోపించడం సరైన పద్ధతి కాదన్నారు. ఇకపై ఎవరైనా సంబంధం లేని, వ్యక్తిగత విషయాల్లో ఎమ్మెల్యే పేరును వాడుకుంటే సహించేది లేదని హెచ్చరించారు. ఎమ్మెల్యే 24 గంటలు ప్రజలకు అందుబాటులోనే ఉంటారని తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన
వ్యక్తికి జైలు శిక్ష

» రూ.3 వేలు జరిమానా

నాగర్‌కర్నూల్ క్రైం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మద్యం తాగి వాహనం నడుపుతూ డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వ్యక్తికి 10 రోజులు జైలు శిక్ష విధిస్తూ న్యాయాధికారి తీర్పు వెల్లడించారు. ఎస్ఐ గోవర్ధన్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నాలుగు రోజుల క్రితం నాగర్‌కర్నూల్ ట్యాంక్ బండ్‌పై పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించారు. ఆ సమయంలో పి.వెంకటేష్ అనే వ్యక్తి మద్యం తాగి వాహనం నడుపు తూ పట్టుబడ్డాడు. దీంతో పోలీసులు అతడిని బుధవారం కోర్టులో హాజరు పరిచారు. నేరం రుజువు కావడంతో 10 రోజుల జైలు శిక్షతో పాటు మూడు వేల రూపాయల జరిమానా విధిస్తూ స్పెషల్ జ్యుడిషియల్ న్యాయాధికారి పి.రామయ్య తీర్పునిచ్చారు.

స్పోర్ట్స్ బాక్స్

ఎస్‌జీఎఫ్ వాలీబాల్ పోటీల్లో
ఆత్మకూరు బాలికల జట్టు విజేత



ఆత్మకూరు బాలికల జట్టు కప్పు అందిస్తున్న ఎస్ఐ రమేశ్

ఆత్మకూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్ - 14 విభాగంలో నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో ఆత్మకూరు బాలికల పాఠశాల జట్టు మొదటి విజేతగా నిలిచిందని ప్రధానోపాధ్యాయుడు కొండాపురం బాలరాజు తెలిపారు. ఉమ్మడి పాలమూరు జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలను పాలమూరు జిల్లాలోని ధన్వాడ మండలంలో బుధవారం నిర్వహించారు. పోటీల్లో వనపర్తి, నారాయణపేట, గద్వాల, నాగర్‌కర్నూల్ జిల్లాల జట్లు పాల్గొన్నాయి. వనపర్తి జిల్లా నుంచి ఆత్మకూరు బాలికల జట్టు, గద్వాల జిల్లా జట్టుపై విజయం సాధించింది. విజేత జట్టుకు ధన్వాడ ఎస్ఐ రమేశ్ కప్పు అందించి అభినందించారు. ఈ జట్టు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నదని ప్రధానో పాధ్యాయుడు తెలిపారు.

బ్యాడ్మింటన్ జట్టు మేనేజర్‌గా రవికుమార్

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : జూనియర్ నేషనల్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ రాష్ట్ర జట్టుకు జిల్లా కేంద్రానికి చెందిన ఎల్. రవికుమార్ మేనేజర్‌గా నియమితులైయ్యారు. ఒడిస్సా రాష్ట్రం భువనేశ్వర్‌లో ఈ నెల 19 నుంచి 25 వరకు నిర్వహించనున్న జూనియర్ నేషనల్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనే రాష్ట్ర జట్టుకు ఆయన మేనేజర్‌గా వ్యవహరించనున్నారు. ఈ మేరకు బ్యాడ్మింటన్ సంఘం రాష్ట్ర కార్యదర్శి పుల్లెల గోపిచంద్ ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా రవికుమార్‌ను శ్యాంసుందర్‌గౌడ్, సంఘ సభ్యులు సాదత్‌ఖాన్, శివప్రసాద్, ప్రవీణ్, విజయ్‌రెడ్డి అభినందించారు.

ముందుకు సాగని ధాన్యం కొనుగోళ్లు

» తాడూరు మండలంలో గత ఏడాది 13 కొనుగోలు కేంద్రాలు
» ఈ ఏడాది నాలుగు కేంద్రాలే ప్రారంభం » ఆందోళన చెందుతున్న రైతులు

తాడూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజను కొంటామని ప్రభుత్వం ప్రకటిస్తున్నా, క్షేత్ర స్థాయిలో ఆ పరిస్థితి కనిపించడం లేదు. గత ఏడాది యాసంగిలో తాడూరు మండల కేంద్రంతో పాటు మండలంలోని 24 గ్రామపంచాయతీల పరిధిలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో 10, మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో మూడు కేంద్రాలు ఏర్పాటు చేసి, ధాన్యం కొనుగోలు చేశారు. కానీ ఈ ఏడాది ఇప్పటి వరకు నాలుగు కొనుగోలు కేంద్రాలను మాత్రమే ఏర్పాటు చేశారు. వాటిలో కూడా ధాన్యం సేకరణ ముందుకు సాగడం లేదు. సివిల్ సప్లయ్, మిల్లర్ల మధ్య ఒప్పందం జరగకపోవడంతో ఈ పరిస్థితి తలెత్తినట్లు తెలుస్తోంది. సేకరించిన ధాన్యాన్ని ఎక్కడికి తరలించాలన్న సందిగ్ధంలో అధికారులు ఉన్నట్లు సమాచారం. ఇప్పటికై చాలా మంది రైతులు వరి కోతలు పూర్తి చేసుకొని, ధాన్యాన్ని రహదారులపై ఆరబోసుకొని, విక్రయించేందుకు ఎదురు చూస్తున్నారు. అయితే వేచి ఉండే పరిస్థితి లేని రైతులు కొందరు ప్రైవేట్ వ్యాపారులకు ధాన్యం విక్రయించి నష్టపోతున్నారు. ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి మిల్లర్లతో ఒప్పందం పూర్తి చేసుకుని వెంటనే ధాన్యం కొనుగోలును వేగవంతం చేయాలని వారు కోరుతున్నారు.



ఐతోల్ గ్రామం వద్ద రహదారిపై ఆరబోసి, విక్రయం కోసం సంచుల్లోకి నింపిన ధాన్యం

ఇంటర్వ్యూ..



రేషన్ డీలర్లు సమయపాలన పాటించాలి

మండల తహసీల్దార్ చింత రవి

ఊట్కూర్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలో రేషన్‌డీలర్లు సమయపాలన పాటించి, చౌక ధర దుకాణాలు వేళకు తెర వాలని తహసీల్దార్ చింతరవి తెలిపారు. బుధవారం ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంట ర్వ్యూలో పలు విషయాలు వెల్లడించారు.

గ్రామాల్లో రేషన్ సరిగా అందుతుందా?

గ్రామాల్లో రేషన్ సరుకుల సరఫరాలో అంతరాయం గురించి మా దృష్టికి వచ్చి ంది. డీలర్లు అందరూ సమయపాలన పా టించాల్సిందే. సర్వే తర్వాత గ్రామాల్లో తిరిగి సరిచేసే ప్రయత్నం చేస్తాం.

భూ సమస్యలు ఉన్నాయా?

భూ సర్వే సమస్యలపై ప్రజలు కార్యా లయానికి వస్తున్నారు. ఇక్కడ ఉన్నాడ మం డల సర్వేయర్ ఇన్‌చార్జి మండలంతో అక్క డ మూడు రోజులు, ఊట్కూర్‌కు మూడు రోజులు కేటాయించారు. సర్వేయర్‌తో మా ట్లాడి భూముల సర్వే చేయిస్తా.

ధరణి సమస్యలు పరిష్కరించారా?

భూ సమస్యల పరిష్కారం కోసం ధర ణిలో చేసిన ఆప్షన్‌లను ప్రభుత్వం తీసుకొ స్తుంది. కొత్త ఆర్‌ఓఆర్ చట్టం కూడా రానున్నది. తర్వాత అన్ని సమస్యలకు పరి ష్కారం లభిస్తుంది.

ప్రజాపాలనలో ఇచ్చిన దరఖాస్తులు ఏమయ్యాయి?

గత ప్రజాపాలన దరఖాస్తు ఆన్‌లైన్ చేసే సమయంలో సూపర్‌వైజింగ్ లేక ప్ర జలకు ఇబ్బంది కలిగింది. ఇప్పుడు ప్రతి మండలంలో సూపర్‌వైజింగ్ ఉంది. సేకరి ంచిన పూర్తి స్థాయి సమాచారం రోజు వారీగా నమోదు చేయించి జిల్లా, రాష్ట్ర స్థాయి వరకు పంపించడం జరుగుతుంది.

నిరుపయోగంగా కంప్యూటర్లు

» ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అందని కంప్యూటర్ విద్య

» తరగతి గదుల్లో దుమ్ముపట్టి పోతున్న కంప్యూటర్లు

» రూ.లక్షలు వృథా



చిన్నపొర్ల పాఠశాలలో వృథాగా ఉన్న కంప్యూటర్లు

ఊట్కూర్, నవంబరు13 (ఆంధ్రజ్యోతి) : కాస్త సాంకేతికంగా జరుగుతున్న అభివృద్ధిలో భాగంగా భవితరాలకు అన్ని రకాల పరిజ్ఞానం అందిం చాలనే లక్ష్యంతో ప్రభుత్వ పాఠశాలల్లో ప్రారంభి ంచిన కంప్యూటర్ విద్య కాస్త మూలనపడింది. రూ.లక్షలు వెచ్చించి కొనుగోలు చేసిన కంప్యూ టర్లు పనికి రాని వస్తువులుగా మిగిలిపోయాయి. ప్రభుత్వ పాఠశాలల్లో ఆర్ట్, మ్యూజిక్, డ్రాయింగ్ టీచర్ల నియామకం కూడా చేపట్టింది. గతంలో ఉన్న కంప్యూటర్ విద్యను మాత్రం మరిచిపోయింది. మండలంలో పెద్దజట్రం, బిజ్వార్, పులిమామిడి, చిన్నపొర్ల, ఊట్కూర్‌లోని బాలుర ఉన్నత పాఠ శాల, బాలికల ఉన్నత పాఠశాలలకు పది నుంచి పదిహేను కంప్యూటర్లు, దానికి కావాల్సిన ఫర్నీ చర్ ఏర్పాటు చేశారు. అలాగే కంప్యూటర్ శిక్షకు లను నియమించారు. దీని కోసం ప్రతీ పాఠశా లకు రూ.రెండు నుంచి రూ.మూడు లక్షల ఖర్చు చేశారు. శిక్షకులను ప్రైవేట్ ఏజెన్సీల ద్వారా నియ మించి నేర్పించడం ప్రారంభించారు. 2009 నుం చి 2014 వరకు నిరంతరం పాఠశాలల్లో విద్యా ర్థులకు కంప్యూటర్ శిక్షణ ఇచ్చారు. కాగా ఎ న్నికల తర్వాత శిక్షకులు లేక కంప్యూటర్లకు దుమ్ముపట్టి పోయి మూలనపడ్డాయి. ప్రస్తుతం కాంగ్రెస్ ప్ర భుత్వం ఆయన పట్టించుకుంటే ఉపయోగం ఉం టుందని విద్యార్థుల తల్లిదండ్రులు అంటున్నారు. ఒక పక్క డిజిటల్ తరగతుల బోధనలు చేస్తూ, కనీస పరిజ్ఞానాన్ని అందించే కంప్యూటర్ శిక్షకు లను నియమించకపోతే ఎలా అని ప్రశ్నిస్తున్నా రు. వెంటనే శిక్షకులను నియమించి కంప్యూట ర్ విద్యను ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అం దేలా చూడాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

శిక్షకులను నియమించాలి



ఎన్ని కంప్యూటర్లు ఉ న్నా శిక్షకులు లేకపోతే ప్ర యోజనం లేదు. ప్రస్తు తం పాఠశాలల్లోని కంప్యూ టర్ గదికి తాళం వేసి ఉంచా రు. మూడేళ్ల కంప్యూటర్ నేర్పించాలి. తర్వాత నిలిచి పో యింది. శిక్షకుల నియామకం చేస్తేనే ప్రయో జనం ఉంటుంది. - నరసింహ, తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి

ఉపాధి హామీలో భారీగా అవినీతి

» రూ.2.70 కోట్లు పక్కదారి

» సమాచార హక్కు చట్టం ద్వారా వెలుగులోకి..

మరికల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కొం దరు పక్కదారి పట్టిస్తున్నారు. మండలంలో 17 పంచాయతీల పరిధిలో భారీ మొత్తంలో ఉపాధి హామీ డబ్బులను పక్కదారి పట్టించి దుర్విని యోగానికి పాల్పడిన విషయం బయటకు పొక్కింది. మూడేళ్లలో రూ.2.70 కోట్ల సొమ్మును కాజేశారు.

కలెక్టర్‌కు ఫిర్యాదు

కన్వనూర్ పంచాయతీతో పాటు 17 గ్రామాల ఉపాధి హామీ పథకంలో జరిగిన పనులకు సం బంధించి వివరాలు కావాలని సమాచార హక్కు చట్టం ద్వారా కొంతమంది ఫిర్యాదు చేశారు. దీం తో బ్యాంకు ఖాతా, పనుల వివరాలు రికార్డులతో సహా బయటకు రావడంతో భారీగా కుంభకోణం జరిగినట్లు రుజువైంది. ఇదే అంశంపై బీజేపీ నా యకులు రికార్డులతో కలెక్టర్ సిక్తా పట్నా యక్‌కు ఫిర్యాదు చేశారు. బీజేపీ నాయకులు ఎంపీ డీకే అరుణ దృష్టికి తెచ్చారు. ఎంపీ ఈనెల 11న జిల్లాలో స్పందించి రూ.2.70 కోట్లు స్వాహా చేసిన బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుని, డ బ్బులను రికవరీ చేయాలని డిమాండ్ చేశారు.

సూత్రధారులు ఎవరు?

మండలంలో ఇంత మొత్తంలో అవినీతికి సహకరించిన వారెవరు, తెరవెనుక ఉన్నవారె వరో తెలియాల్సి ఉంది. అవినీతికి పాల్పడిన వారిని సస్పెండ్ చేస్తేనే పరిష్కారం లభిస్తుం దని, పూర్తిస్థాయి విచారణ చేసి చర్యలు తీసుకు ంటే తప్ప ఇలాంటి ఘటన ఎన్నటికీ పునరావృతం అ య్యే అవకాశం ఉండదు. మండల వ్యాప్తంగా ఉ పాధి పనులను ప్రత్యేక బృందం విచారణ చేస్తేనే డబ్బు రికవరీ అయ్యే అవకాశం ఉంటుం దని మండల ప్రజలు కోరుతున్నారు.

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

నారాయణపేట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని గ్రంథాల యంలో వారోత్సవాల సందర్భంగా పలు కార్య క్రమాలను నిర్వహిస్తున్నట్లు కార్యదర్శి సురేష్ బాబు, బుధవారం తెలిపారు. గురు వారం జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభిస్తారు. 15న పుస్తక ప్రదర్శన, 16న వాతావరణ కాలుష్య నివారణపై వ్యాసరచన పోటీలు, 18న స్వా తంత్ర్య సమర యోధులపై చిత్ర లేఖనం పోటీలు, 19న మహిళాదినోత్సవం సందర్భ ంగా ముగ్గుల పోటీలు, 21న బహు మతుల ప్రదానోత్సవం ఉంటాయని తెలిపారు.

జిల్లా వ్యాప్తంగా 57,064 ఇళ్ల సర్వే పూర్తి

నారాయణపేట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా బుధ వారం ఇంటింటి సర్వే కొనసాగింది. కలెక్టర్ సిక్తా పట్నాయక్ మద్దూర్‌లో, జిల్లా ప్రణాళిక అధికారి యోగానంద్ నారాయణపేటలో ప ర్యవేక్షించారు. గ్రామీణ ప్రాంతాల్లో 1,33,595 కుటుంబాలకు గాను 47,755 ఇళ్ల సర్వే పూర్తి చేశారు. మూడు మునిసిపాలిటీల్లో 22,464 కుటుంబాలకుగాను 9,309 కుటుంబాల సర్వే పూర్తి చేశారు. నాలుగు రోజుల్లో జిల్లాలో మొత్తం 57,064 కుటుంబాల సర్వే పూర్తిచేశారు.

ఓటీపీలను ఎవరితోనూ పంచుకోవద్దు : ఎస్‌ఐ

మక్తల్ రూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండల ప్రజలు సైబర్ నేర గాళ్లతో అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ భాగ్యలక్ష్మిరెడ్డి ప్రకటనలో తెలిపారు. ప్రభు త్వం చేపట్టిన సామాజిక కుటుంబ సర్వేను ఆసరాగా తీసుకొని సైబర్ నేరగాళ్లు మీ ఫోన్లకు ఓటీపీ వచ్చిందని అది చెప్తే మీకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయని మోస పూరితమైన మాటలు చెప్తారని తెలి పారు. అదేవిధంగా మద్యం తాగి ద్విచక్ర వాహనాలను నడుపవద్దని, హెల్మెట్ తప్ప కుండా ఉపయోగించాలని సూచించారు. వాహనాలకు సంబంధించి తగిన పత్రాలు తప్పకుండా కలిగి ఉండాలని తెలిపారు.

పోలీసుల అసమర్థతతోనే అధికారులపై దాడి



దామరగిద్దలో మాట్లాడుతున్న నాగూరావు నామాజీ

దామరగిద్ద, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పోలీసు వ్యవస్థ అ సమర్థత వల్లే వికారాబాద్ కలెక్టర్, రెవెన్యూ అధికారులపై దాడి జరిగి ందని బీజేపీ రాష్ట్ర క్రమ శిక్ష ణ సభ్యుడు నాగూరావు నామాజీ వి మర్శించారు. బుధవారం నారాయ ణపేట మునిసిపాలిటీ ఫ్లోర్ లీడర్ సత్యరఘుపాల్‌రెడ్డి, జిల్లా కార్య వర్గ సభ్యుడు గోపాల్‌రావు, జిల్లా అధికార ప్రతి నిధి వెంకయ్య, నవీ వికారాబాద్ జిల్లా కొడ ంగల్ నియోజకవర్గం దుద్యాల మండలం లగచ ర్లలో జరిగిన ఘటనలో రైతులను పరామర్శిం చేందుకు వెళ్తున్న సందర్భంగా దామరగిద్దలో పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. రైతులకు బీజేపీ అండగా ఉంటుందన్నారు. కొడ ంగల్ నియోజక వర్గంలో ఇంటర్నెట్ సేవలు కూడా బంద్ చేశారని విమర్శించారు. యకుడు రతంగ్ పాండు రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రఘురామయ్య గౌడ్ విమర్శించారు. అరెస్టయిన వారిలో రతంగ్‌పాండురెడ్డి, రఘురా మయ్యగౌడ్, లక్ష్మీశ్యాంసుందర్ తదితరులున్నారు.

బీజేపీ నాయకుల అరెస్ట్

నారాయణపేట: మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ లగచర్ల పర్యటన సందర్భంగా జిల్లా కేం ద్రం నుంచి బయలు దేరుతున్న నాయకులను ఇళ్ల వద్దే అరెస్ట్ చేయడం సిగ్గుచేటని బీజేపీ నా

నారాయణపేట రూరల్: మండలంలోని కోట కొండలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, కెంచి శ్రీనివాస్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు.

మక్తల్ రూరల్: పట్టణంలో బీజేపీ, బీజేవైఎం నాయకులను పోలీసులు బుధవారం ముందస్తు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. పోలీసుల అదుపులో కుర్వ లింగం, పీకే నర్సింహ, బ్యాటరీ రాజు,నాగరాజుగౌడ్ ఉన్నారు.

మరికల్: మండల బీజేపీ శ్రేణులను ఎస్‌ఐ మురళి అరెస్టు చేశారు. రమేష్, వేణు, వెంకటేష్, శ్రీరామ్, రాజేష్, నరేష్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

పార్టీని పటిష్టం చేసేందుకు కృషి చేయాలి

» రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు వెంకట్ రాములు

నారాయణపేట రూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): బీజేపీని పటిష్టం చేసి మం డలంలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో మెజార్టీ స్థానాలు కైవసం చేసుకునేందుకు కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు వెంకట్ రాములు, మండల అధ్యక్షుడు సాయిబన్న పిలుపునిచ్చారు. బుధ వారం జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న వెంకట్ రాములు మాట్లా డారు. సభ్యత్వ విస్తరణ చేపట్టాలన్నారు. పార్టీకి అంకితమైన వారి సేవలను గుర్తించి పదవులు ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్య క్రమంలో నర్సింహులు, శ్రీనివాస్, నారా యణరెడ్డి తదితరులున్నారు.

మాజీ ఎమ్మెల్యే అరెస్ట్ అప్రజాస్వామికం



మక్తల్‌లో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

నారాయణపేట టౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కొడంగల్ మాజీ ఎమ్మెల్యే అరెస్ట్ అప్రజాస్వామికమని బీఆర్‌ఎస్ నారాయణపేట జిల్లా అధ్యక్షుడు ఎస్.రాజేందర్‌రెడ్డి ప్రకటనలో తెలిపారు. ఫార్మా కంపెనీకి భూములు ఇవ్వడా నికి ముందు నుంచి కూడా ఆయా గ్రామస్థులు అంగీకరించలేదని, ఆయినా బలవంతంగా భూ సేకరణకు వెళ్లడం ఎంతవరకు సమంజసమని విమర్శించారు. అనవసరంగా పట్నం నరేందర్‌రె డ్డిని ఇరికించే ప్రయత్నం చేయడాన్ని మానుకో వాలని హితవుపలికారు.

రైతులకు మద్దతు తెలిపితే అరెస్ట్ చేస్తారా?

మక్తల్ రూరల్: కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అరెస్టు అప్రజాస్వామికం, అనైతికమని మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహ న్‌రెడ్డి తీవ్రంగా ఖండించారు. బుధవారం ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమా వేశంలో మాట్లాడుతూ.. ఫార్మా కంపెనీకి భూము లు ఇవ్వడానికి ముందు నుంచి కూడా లగచర్ల, రోటిబండ తండా, పులిచర్లకుంట తండా, దుద్యాల, పోలే పల్లి, హకీంపేట వాసులు వ్యతిరేకిస్తున్నారన్నారు. అందులో భాగంగా ఆయా గ్రామాల రైతులు నాలుగు నెలలుగా నిరసనలు తెలిపారన్నారు. అందోళన కార్యక్రమాలు చేపట్టి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడం కూడా జరిగిందన్నారు. ఆ ప్రాంత మాజీ ఎమ్మెల్యేగా రైతులకు మద్దతు తెలిపి సంఘీభావం తెలియజేయడం జరిగిందన్నారు. బాధితుల తరఫున పాదయాత్ర చేపట్టిం దుకు శ్రీకారం చుడితే కాంగ్రెస్ ప్రభుత్వం ఒత్తి డితో బలవంతంగా పోలీసులు అదుపుకొని స్టేషన్ కు తరలించి పాదయాత్రను భంగం చేశారని అన్నారు. కార్యక్రమంలో నరసింహాగౌడ్, శ్రీనివాస్ గుప్తా, చిన్న హనుమంతు, ఎల్లారెడ్డి, కృష్ణారెడ్డి, ఈశ్వర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అరెస్టు చేయడం అక్రమం

కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేంద ర్‌రెడ్డిని అరెస్టు చేయడం అక్రమమని తెలంగాణ ఉద్యమకారుడు రాములింగం బుధవారం ప్రకటనలో తెలిపారు.

బీఆర్‌ఎస్ నాయకుల నిరసన

మద్దూర్: మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అరెస్టును ఖండిస్తూ బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో మద్దూర్‌లో నిరసన వ్యక్తం చేశారు. స్థానిక ఆర్అండ్‌బీ అవరణలో మాట్లాడుతూ.. భూము లు కోల్పోతున్న రైతులతో మాట్లాడ్డాన్ని నేరంగా పరిగణిస్తూ అధికారం చేతిలో ఉంది కేసులో మాజీ ఎమ్మెల్యేను అరెస్టు చేయడం సబబు కాదన్నారు. క్రిష్ణానాయక్, బాల్‌చందర్, రాములు, జనార్దన్, తలారి రాములు, దాను పాల్గొన్నారు.

నరేందర్‌రెడ్డిని విడుదల చేయాలి

కోస్గి: పట్నం నరేందర్‌రెడ్డిని వెంటనే విడుదల చేయాలని బీఆర్‌ఎస్ నాయకులు శివాజీ కూడ లిలో ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో శాసం రా మకృష్ణ, వెంకట్‌ నర్సింహులు, పోశప్ప, సాయప్ప, జనార్దన్‌రెడ్డి, సాయిలు తదితరులున్నారు.

దామరగిద్ద: కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డిని అరెస్టు చేయడం సరికాదని బీఆ ర్‌ఎస్ మండల అధ్యక్షుడు సుభాష్ బుధవారం ప్రకటనలో తెలిపారు.

తప్పులు లేకుండా వివరాలు నమోదు చేయాలి

» కలెక్టర్ సిక్తాపట్నాయక్



మద్దూర్‌లో సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ సిక్తాపట్నాయక్

మద్దూర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి తప్పుల కు తావివ్వకుండా వివరాలను నమోదు చేయాలని ఎన్యుమరే టర్లకు కలెక్టర్ సిక్తా పట్నాయక్ సూచించారు. బుధవారం మండ లంలో కొనసాగుతున్న సర్వేను పరిశీలించారు. పట్టణంలోని మీది గేరులో చేపడుతున్న కుటుంబ వివరాలను నమోదు చేసుకోవడానికి ఎంత సమయం పడు తుందని ఎన్యుమరేటర్‌ను అడిగారు. చిన్న కు టుంబమైతే పది నిమిషాలు, పెద్ద కుటుంబం, భూమి వివరాలు ఉంటే 15 నుంచి 20 నిమి షాల సమయం పడుతుందని ఎన్యుమరేటర్ కలెక్టర్‌కు వివరించారు. జాబితాలో అడిగే వివ రాలను తెలిసి వారికి సహకరించాలని కుటుంబ యజమానులకు కలెక్టర్ సూచించారు. పలు వివరాలను ఎంపీడీవో నర్సింహారెడ్డికి కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఎంపీవో నర్సింహారెడ్డి, రా మన్న, దేవరాజ్ తదితరులు పాల్గొన్నారు.

యాదవులకు గుర్తింపునిచ్చిన పండుగ సదర్



ఆలయంలో పూజలు చేస్తున్న తిరుపతిరెడ్డి, నాయకులు

కోస్గి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో యాదవ సంఘం నాయకులు సదర్ ఉత్సవాలు ఘనంగా ని ర్వహించారు. బుధవారం వేణు గోపాలస్వామి ఆలయంలో కాం గ్రెస్ పార్టీ కొడంగల్ నియో జకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి ప్రత్యేక పూజలు చేసి సదర్ ఉత్సవాలు ప్రారంభించారు. యాదవుల అత్యంత పవిత్రంగా నిర్వహించే ఈ ఉత్సవాలను ప్రభుత్వం అధికారికంగా ప్రకటిం చిందని గుర్తు చేశారు. ప్రభుత్వం యాదవుల అ భ్యున్నతికి కట్టుబడి ఉందన్నారు. అనంతరం యాదవులు వేణుగోపాలస్వామి ఆలయం నుంచి శివాజీ కూడలి వరకు దున్నపోతులను ఆడిస్తూ ఆటపాటతో అందరిని అలరించారు. కార్యక్రమం లో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వార్ల విజ యకుమార్, రఘువర్ధన్‌రెడ్డి, నరేందర్, హరి, శ్రీనివాస్‌యాదవ్, హన్మంతు తదితరులున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో కరాటే శిక్షణ



మక్తల్‌లో కరాటే నేర్చుకుంటున్న విద్యార్థులు

మక్తల్‌రూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా రాణి లక్ష్మీబాయి ఆ త్మరక్షణ కార్యక్రమంలో భాగంగా ఎంపిక చేసిన ప్రభుత్వ పాఠశాలల్లో మూడు నెలల పాటు ఉచి తంగా కరాటే శిక్షణ ఇస్తున్నారు. అందులో భా గంగా పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల లో కరాటే మాస్టర్ సయ్యద్ ఇస్మాయిల్ ఆధ్వర్య ంలో విద్యార్థులకు శిక్షణ బుధవారం ప్రారంభిం చారు. పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం గోపాలాచారి మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా 124 పా ఠశాలలను ఎంపిక చేసిన ప్రభుత్వం కరాటే కోచ్‌లకు గౌరవవృతిని అందిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థినులు ఏదైనా ఆపత్కర సమయంలో తమను తాము రక్షించుకునే విధంగా శిక్షణ దోహదపడుతుందన్నారు. మూడు నెలల పాటు వారానికి మూడుసార్లు శిక్షణ ఉంటుందని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచిం చారు. అనంతరం కరాటే మాస్టర్ విద్యార్థినులకు కరాటే శిక్షణలో భాగంగా మెళకువలను నేర్పించారు.

చదువుతో పాటు కళలు ముఖ్యం

నారాయణపేట న్యూటౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు కళారంగాల్లో శిక్షణ పొందాలని మదర్ ఆఫ్ పీస్ సం జిల్లా అధ్యక్షుడు సరఫ్ నాగరాజ్ పిలు పునిచ్చారు. బుధవారం జిల్లా కేంద్రంలోని బాల కేంద్రంలో జరిగిన చిత్రలేఖన పోటీల్లో పాల్గొ న్న విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. బాల కేంద్రంలో కళ అంశాలపై శిక్షణను పొంది సద్వి నియోగం చేసుకోవాలన్నారు. బాలల దినోత్సవం సందర్భంగా జరిగిన చిత్రలేఖనం పోటీల్లో ప్రతి భ చాటిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ మహి పాల్‌రెడ్డి, సంగ నర్సింహులు, సంపత్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మన్యవాగును తోడేస్తున్నారు..



మన్యవాగు నుంచి ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్

» ట్రాక్టర్ల ద్వారా ఇసుక అక్రమంగా తరలింపు

మరికల్, నవంబర్ 13 (ఆంధ్రజ్యోతి): అధికారులు పట్టించుకోకపోవడంతో మండ లంలోని మన్యవాగును ఇసుక రవాణా వ్యా పారులు దోచుకుంటున్నారు. రాత్రి వగలు తేడాలేకుండా వాగులో ఉన్న ఇసుకను తో డేస్తూ ఇతర గ్రామాలకు తరలిస్తున్నారు. దీంతో వాగు చుట్టూ ఉన్న వ్యవసాయ బోర్లలో భూగర్భ జలాలు అడుగంటి పోతు న్నాయి. ఎల్లిగండ్ల చెందిన ఇసుక వ్యాపా రులు జాతీయ రహదారి పక్కనే ఉన్న వాగులో రోజుకు దాదాపు 20 ట్రాక్టర్ల ఇసుకను అక్రమంగా తరలిస్తూ అధిక ధరకు విక్రయించి సొమ్ము చేసుకుంటు న్నారు. ఇసుక అక్రమంగా రవాణా జరు గుతున్న సంబంధిత అధికారులు పట్టిం చుకోకపోవడంతో వారి దందాకు అడ్డు అదుపు లేకుండా పోయింది. ఒక్కో ట్రిప్పుకు రూ. ఐదు వేల నుంచి రూ.ఆరు వేల చొప్పు న విక్రయిస్తున్నారు. రోజుకు ఒక ట్రాక్టర్ ఐదు ట్రిప్పుల కొడుతున్నట్లు సమాచారం. అధికారులు స్పందించి ఇసుక రవాణాను అక్రమ అరికట్టాలని గ్రామస్థులు కోరు తున్నారు.

ప్రమాదకరంగా రోడ్డు మలుపులు



అడవి సత్యారం నుంచి కొల్లూరు వెళ్లే రహదారిపై ఏపుగా పెరిగిన కంపచెట్లు

మాగనూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల రహదారులు ప్రమాదకరంగా మలుపులతో తరచూ రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని మం డల ప్రజలు వాపోతున్నారు. రోడ్డు మలుపుల వద్ద పూరాతన బావులు, కల్వర్టుల వద్ద, ఇ రువైపుల మలుపుల వద్ద సూచిక బోర్డు ఏర్పా టు చేయకపోవడంతో వాహనదారులు రాత్రి వేళల్లో ప్ర యాణించాలంటే ప్రమాదాలు చోటు చేసుకుం టున్నాయని స్థానిక ప్రజలు తెలిపారు. మలు పుల వద్ద ఏపుగా పెరిగిన కంప చెట్లు, పిచ్చి మొక్కలు ఉండటంతో ఎదురుగా వస్తున్న వాహ నాలు కనిపించడం లేదని వాపోతున్నారు. మం డలంలోని 167వ జాతీయ రహదారి నుంచి వ డ్డాటు నుంచి మందిపల్లి వెళ్లే బీటీ రోడ్డు గుం తలు ఉన్నాయని, మరమ్మతులు చేయాలని ప్ర జలు కోరుతున్నారు. అధికారులు స్పందించి రో డ్డుకు ఇరువైపులా కంప చెట్లు తొలగిస్తూ మర మ్మతు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

న్యూస్ బాక్స్

కేజీబీవీలో వైద్య శిబిరం

దామరగిద్ద, నవంబరు13 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో ఉన్న కేజీబీవీ బాలికల విద్యాలయంలో విద్యార్థినులకు బుధవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు కీర్తి ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. 210 మంది విద్యార్థినులకు పరీక్షలు నిర్వ హించారు. 11 మంది అనారోగ్యంగా ఉండ డంతో వారికి అవసరమైన మందులు ఇచ్చా రు. మరో ఆరుగురికి రక్త పరీక్షలు నిర్వహి ంచినట్లు సూపర్‌వైజర్ జానకమ్మ తెలిపారు. ఏఎన్ఎం రాజేశ్వరి, ల్యాబ్ టెక్నీషియన్ శ్రీని వాస్‌రెడ్డి, కేజీబీవీ ప్రత్యేకాధికారి విజయ తదితరులు పాల్గొన్నారు.

నేడు వైద్య శిబిరం

నారాయణపేట న్యూటౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ప్రభుత్వ జిల్లా ఆసు పత్రిలో గురువారం ఉదయం పది గంట లకు ఉచిత డయాబెటిక్ శిబిరం నిర్వహి స్తున్నట్లు ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు మల్లికా ర్జున్, కార్యదర్శి ప్రసాద్ శెట్టి బుధవారం తెలిపారు. రక్త పరీక్షలు నిర్వహించి మందు లు అందించడం జరుగుతుందని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మూడు రోజులు పత్తి కొనుగోలు బంద్

మక్తల్‌రూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : పత్తి కొనుగోలు కేంద్రాలు మూడు రోజులు బంద్ ఉంటాయని మక్తల్ అగ్రికల్చర్ మార్కెట్ కార్యదర్శి చంద్రశేఖర్ బుధవారం తెలిపారు. శుక్రవారం కార్తీక పౌ ర్ణమి సందర్భంగా శని, ఆదివారాల్లో సాధా రణ సెలవులు ఉంటాయని ఆయన తెలిపా రు. తిరిగి 18న సోమవారం కొనుగోలు ప్రా రంభం అవుతాయని, రైతులు పత్తిని సంచు లలో తీసుకురావద్దని, విడిగా లోడ్ చేయాలని ఆధార్‌కార్డు, పట్టా పాస్‌బుక్, బ్యాంక్ జి రాక్స్ కాపీలు తీసుకొని రావాలని కోరారు.

25న భగవద్గీత శ్లోకాల కంఠస్థ పోటీలు

మక్తల్ రూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పడమటి ఆంజ నేయస్వామి దేవాలయంలో ధర్మ రక్షణ భగవద్గీత కంఠస్థ పోటీల కరపత్రాలను వీహె చ్‌పీ నాయకులు విడుదల చేశారు. భగవ ద్గీత శ్లోకాల కంఠస్థ పోటీలు 25న తేదీన సో మవారం ఉదయం 9.30 గంటలకు రాయ చూరు రోడ్డులోని వీపీసోనిపా సత్యసాయి మందిరంలో నిర్వహిస్తామని వీహెచ్‌పీ నా యకులు తెలిపారు. విద్యార్థులకు చదువుతో పాటు సంస్కారాన్ని, దైవభక్తిని అందించే ల క్ష్యంతో ప్రతి సంవత్సరం పోటీలు నిర్వహి స్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సత్యనారాయణగౌడ్, బీమేష్, మల్లికార్జునరా వు, రాహుల్, శివ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

దామరగిద్ద, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కానుకుర్తి 33కేవీ లైన్ మర మ్మతుల కారణంగా లోకుర్తి, ఉళ్లనూర్, దాక ల్వాన్‌పల్లి, పిడెంపల్లి, కంద్రేన్‌పల్లి గ్రామా లకు గురువారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యు త్ అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ అధికారులు బుధవారం ప్రకటన విడుదల చేశారు. వినియోగదారులు, రైతులు సహ కరించాలని కోరారు.